BALAGAM TV


BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ సోమవారం, 18 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం



మిగతా 3లో..

## ఢిల్లీకి ఎండ గండం..



- ఇప్పటికే ఉడుకుతున్న ఢిల్లీ.. మిగతా 3లో..
- ఎండలు ఇంకా పెరుగుతాయన్న ఐఎండీ

# రేవంత్..ఫ్యూచర్ లేని లీడర్..

- మళ్లీ బీఆర్ఎస్ పాలనను తెచ్చుకుందాం: కేటీఆర్
- కారుచీకట్లో చిరుదీపం కేసీఆర్
- ఎస్ఐఆర్‌తో అప్రమత్తంగా ఉండాలి



**హైదరాబాద్, మే 17:** ఎంత బిల్డప్ ఇచ్చినా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్యూచర్‌లేని నాయకుడే అని, ఫ్యూచర్‌సిటీ పేరుతో ఏదో చేయాలను కుంటున్నాడు కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులే ఆయన్ను పక్కన పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అన్ని రంగాల్లో అంతర్జాతీయ పెట్టుబడి కేంద్రంగా ఎదిగిన రాష్ట్రం రెండున్నరేండ్లలోనే అధోగతి పాలైందని ఆందోళన వ్యక్తంచేశారు. శాంతిభద్ర తలు కరువై మహిళలకు రక్షణ లేకుండా పోయే ఘటనలు పునరావృతమవు తున్నాయని, అందుకు ఇటీవలి బండి సంజయ్ కుమారుడు ఓ ఆడబిడ్డపై చేసిన అఘాయిత్యమే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఆ బాధిత బాలిక విషయంలో అన్యాయం జరిగినా రాష్ట్ర సర్కార్ దున్నపోతు మీద వర్షం పడినట్టు వ్యవహరించిందని కానీ బీఆర్ఎస్ పార్టీ బాలిక కుటుంబానికి అండగా నిలబడి, భరోసానిచ్చిందని చెప్పారు. ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురంలో జరిగిన బూత్ లెవల్ ఏజెంట్ సన్నాహక, శిక్షణ సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ లక్ష్యాలను వివరించి వారికి దిశానిర్దేశం చేశారు. తుఫాన్‌లో చిరుదీపం వెలిగించిన నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ పేర్కొన్నారు. మే 17కు ఒక ప్రత్యేకత ఉన్నదని 25 ఏండ్ల క్రితం ఇదే రోజున కేసీఆర్ ఆధ్వర్యంలో సింహగర్జన పేరిట తొలి బహిరంగసభ తలపెట్టారని, ఇప్పుడు అదే రోజున ఎల్బీ నగర్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించుకోవడం గర్వం ఉన్నదని చెప్పారు. 26వ వసంతంలోకి అడుగు పెట్టి, లక్షలాది కార్యకర్తలు, వేలాది నాయకులుగా ఎదిగారంటే ఆయనకున్న సమర్థవంతమైన నాయకత్వం వల్లే సాధ్యమైందని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో బూత్ లెవల్ నాయకత్వం, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఆయన సొంతమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలకు ఇప్పటినుంచే కార్యకర్తలు సన్నద్ధం మిగతా 3లో..

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాల్సిందే

- ఆడబిడ్డకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ అండగా నిలిచింది :కేటీఆర్
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్
- హైదరాబాద్‌లో నిర్వహించిన 'నా బూత్-నా భవిష్యత' కార్యక్రమం



**హైదరాబాద్, మే 17:** కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాల్సిందేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగిన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోయినా ఆ తల్లి, కూతురికి న్యాయం జరిగేలా అండగా నిలిచిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని వనస్థలిపురం డివిజన్ పరిధిలోని జీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'నా బూత్–నా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోగా, కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికిందని విమర్శించారు. అలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలిచి కొంత మేర న్యాయం జరిగేలా కృషి చేసిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేసి అనంతరం విచారణను ఎదుర్కోవాలని డిమాండ్ చేశారు. పార్టీ బలోపేతంలో బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర కీలకమని, ప్రతి కార్యకర్తా శిక్షణ తీసుకుని సమర్థంగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేయడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. 30 నుంచి 40 ఏండ్లుగా నివసిస్తున్న ప్రజల ఇండ్లను కూల్చివేస్తున్నారని, కానీ వారికి ఇండ్లు కట్టించే బాధ్యత మాత్రం తీసుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1200 కోట్లతో తెలంగాణలో కిమ్స్ ఆస్పత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అందులో భాగంగానే ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేటలో మల్టీ స్పెషాలిటీ కిమ్స్ ఆస్పత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. పార్టీ సభ్యత్వాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయాలని, ఎక్కువ సభ్యత్వాలు నమోదు చేసి పార్టీ మిగతా 3లో..

## భీమ్‌గల్ కాంగ్రెస్‌లో భగ్గుమన్న అసమ్మతి



- చిచ్చు రేపిన ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడి నియామకం
- మండలంలోని పార్టీ నాయకులు, పలువురు సర్పంచుల తిరుగుబాటు
- బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దిష్టిబొమ్మ దహనం
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సొంత మండలంలో తలనొప్పి మిగతా 2లో..

## 'కరీంనగర్ సింహగర్జన'కు 25 ఏండ్లు..



- మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఓ మైలురాయి
- బీఆర్ఎస్‌ది అదే జోష్ : కేటీఆర్

**హైదరాబాద్, మే 17:** 'చరిత్రాత్మక సింహగర్జనకు మే 17వ తేదీతో 25 ఏండ్లు నిండాయి.. నాటి నుంచి నేటి నుంచి వరకు గులాబీ పార్టీది అదే జోష్..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆదివారం అప్పటి చారిత్రక సందర్భాన్ని ఎక్స్ వేదికగా గుర్తుచేసుకున్నారు. నాడు దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలు, ఫొటోలను తన పోస్ట్‌కు ట్యాగ్ చేసి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పటి సింహ గర్జన సభ నుంచి నిన్నటి రజతోత్సవ సభ వరకు టీఆర్ఎస్, బీఆర్ఎస్ ఎన్నో మైలురాళ్లను అధిగమించిందని చెప్పుకొచ్చారు.'కేసీఆర్ మిగతా 3లో..

## బండి సంజయ్ రాజకీయ భవిష్యత్తుకు బీటలు..

- పోక్సో కేసుతో జాతీయస్థాయిలో బజారున పడ్డ పరువు



**హైదరాబాద్, మే 17:** రాజకీయాల్లో ఆత్మహత్యలు తప్ప హత్యలు ఉండవు అనేది నానుడి. తాజాగా ఇది కేంద్ర మంత్రి బండి సంజయ్ విషయంలో నిరూపితమైంది. కొడుకు 'కళలు'.. బండి రాజకీయ భవిష్యత్తుకు బీటలు వేశాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకొని తన రాజకీయ భవిష్యత్తును తానే ప్రమాదంలోకి నెట్టుకున్నారనే చర్చ నడుస్తున్నది. ఈ కేసులో ఆయన చేసిన అతే ఆయనకు శాపంగా మారిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కొడుకుపై మిగతా 3లో..

## అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వం



- మంత్రి జూపల్లి ఆసక్తికర వ్యాఖ్యలు
- ఏటా రూ.70వేల కోట్ల మేర అప్పు పెరుగుతున్నది
- రుణ ఊబిలోనే మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయ్ కూడా

**నాగర్‌కర్నూల్, మే 17:** రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయిందని, ఏటా 70వేల కోట్ల అప్పు అదనంగా వచ్చి చేరుతున్నదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్లు కూడా అప్పుల ఊబిలో కూరుకు పోయాయని చెప్పారు. అకాల వర్షానికి నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆదివారం పరిశీలించడానికి వచ్చిన మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఎకరానికి 50 నుంచి 60 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుండటం తోనే కొనుగోలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం రైతు మెప్పు పొందేందుకు మద్దతు ధర ప్రకటిస్తుందే కానీ ధాన్యాన్ని కొనడం లేదని, కొనుగోలు అంతా రాష్ట్ర ప్రభుత్వంపై రుద్దుతున్నదని ఆరోపించారు. ఐకేపీ ద్వారా మహిళా సంఘాలు కొనుగోలు చేస్తున్న ధాన్యానికి వెంటనే సదరు రైతుకు రసీదు ఇవ్వాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తన దృష్టికి వెంటనే ఆ సంఘాన్ని రద్దు చేస్తామన్నారు.

## డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు..

- 39 కిలోల అల్ప్రాజోలం, రూ.85లక్షలు స్వాధీనం
- ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న ఎన్‌సీబీ



**హైదరాబాద్, మే 17:** రాష్ట్రంలో అక్ర మంగా మత్తు పదార్థాలు తయారు చేస్తూ, సరఫరా చేస్తున్న ఓ డ్రగ్స్ ముఠా గుట్టును నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు రట్టు చేశారు. ఈ దాడిలో భారీగా అల్ప్రా జోలం డ్రగ్‌తోపాటు రూ.85 లక్షలకు పైగా నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట ఔటర్ రింగ్ రోడ్డులోని కాళ్లకుంట కాలనీ సమీపంలో నిఘా పెట్టారు. అనుమతి లేకుండా అక్రమంగా డ్రగ్స్ మార్పిడి జరుగుతున్నట్టు గుర్తించిన అధికారులు రెండు కార్లను అడ్డుకొని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారువారి నుంచి 39.470 కిలోల ఆల్ప్రాజోలం, రూ.85,36,200 మిగతా 3లో..

## సీబీఎస్ఈ ఫలితాలపై వివాదం..

- నీట్ లీకేజీ వేళ మరో కలకలం
- 12వ తరగతి ఫలితాలపై విద్యార్థుల అనుమానాలు
- ఓఎంఎస్ విధానంపై సందేహాలు
- బాగా రాసినా తక్కువ మార్కులొచ్చాయని ఆందోళన
- విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం .. నెటిజన్ల ఫైర్
- రీవాల్యుయేషన్ ఫీజు 100కు తగ్గించిన సీబీఎస్ఈ మిగతా 2లో..

## రష్యాపై భారీ డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి..



- భారతీయ కార్మికుడితో సహా నలుగురు మృతి

**మాస్కో:** భారీ సంఖ్యలోని డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ దాడి చేసింది. భారతీయ కార్మికుడితో సహా నలుగురు మరణించారు. మరో ముగ్గురు భారతీయ కార్మికులు, మరి కొందరు గాయపడ్డారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ధృవీకరించింది. దాడి జరిగిన ప్రదేశాన్ని అధికారులు సందర్శించారని, గాయపడిన కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించినట్లు తెలిపింది. 'ప్రాణనష్టం పట్ల రాయబార కార్యాలయం సంతాపం వ్యక్తం చేస్తోంది. భారతీయ కార్మికులకు అవసరమైన సహాయం అందించడానికి కంపెనీ యాజమాన్యం, స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోంది' అని భారత రాయబార కార్యాలయం ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది.కాగా, ఆదివారం మిగతా 3లో..

## ధాన్యం కొనరు.. లారీల కొరత తీర్చరు

- రైతులను సతాయిస్తున్న సర్కార్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- మెదక్ జిల్లా చిన్నగొట్టిముక్క, చెన్నాపూర్‌లో కేంద్రాల పరిశీలన



**హైదరాబాద్, మే17 :** ధాన్యం కొనరు, లారీల కొరత తీర్చరూ ఇదేం సర్కార్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రశ్నించారు. లారీల కొరతతో ధాన్యం కాంటా చేస్తలేరని, ధాన్యం తరలించడంలో తీవ్ర జాప్యం చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్క, చెన్నాపూర్ గ్రామాల్లో మిగతా 3లో..

# రాజన్న గోశాలకు 65 ట్రాక్టర్ల ఎండు గడ్డి విరాళం..



**-ఐదేళ్లుగా నిరంతరాయంగా రైతు సేవలు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని తిప్పాపురం గోశాలకు పెద్దపెల్లి జిల్లాకు చెందిన రైతులు మరియు జానకిరామ్ ట్రాక్టర్ ఓనర్ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు భారీగా ఎండు గడ్డిని విరాళంగా అందజేశారు. కనుకుల, మారుతినగర్, రామునిపల్లి, తొగర్రాయి ప్రాంతాలకు చెందిన భక్తులు ఈసారి ఏకంగా 65 ట్రాక్టర్ల ఎండు గడ్డిని సమర్పించి తమ అపార భక్తిని చాటుకున్నారు. ఈ రైతులు గత ఐదేళ్లుగా గోశాలకు నిరంతరంగా సేవలు అందిస్తున్నారు. మొదట్లో కేవలం 10 ట్రాక్టర్ల గడ్డితో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం, నిరంతరంగా సాగుతూ గత ఏడాది 45 ట్రాక్టర్లకు చేరుకుంది. ఈ ఏడాది ఏకంగా 65 ట్రాక్టర్ల ఎండు గడ్డిని విరాళంగా అందజేసి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. రైతులు సేకరించిన ఈ విరాళాన్ని దేవస్థానం డీఈఓ భాస్కర శర్మకి అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు రైతులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, అనం తరం స్వామివారి ప్రసాదాన్ని అందజేసినారు. దేవస్థానం ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి మాట్లాడుతూ, గోశాలకు ఎండు గడ్డి, పచ్చగడ్డి, కూరగాయలు, పండ్లు, ఫలాలు తీసుకొచ్చి గోవులకు ఆహారం అందిస్తున్న భక్తులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గో సేవ ఎంతో పుణ్యప్రదమైందని, గోవులకు ఆహారం పెట్టడం ద్వారా అపారమైన పుణ్యం లభిస్తుందని పేర్కొన్నారు. గోశాలకు సేవ చేయాలనుకునే భక్తులు నేరుగా గోశాలకు వచ్చి తమ వంతు సహాయం అందించవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, గోశాల పర్యవేక్షకులు విజయ్, గోశాల జూనియర్ అసిస్టెంట్ గొట్టం రవి, ఆలయ ఉద్యోగులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# భీమ్‌గల్ కాంగ్రెస్‌లో భగ్గుమన్న అసమ్మతి

- చిచ్చు రేపిన ఆ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడి నియామకం
- మండలంలోని పార్టీ నాయకులు, పలువురు సర్పంచుల తిరుగుబాటు
- బాల్కొండ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దిష్టిబొమ్మ దహనం
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సొంత మండలంలో తలనొప్పి



**భీమ్‌గల్, మే 17:** నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలో కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య అసమ్మతి భగ్గుమన్నది. మండల అధ్యక్షుడి నియామకం పార్టీలో చిచ్చు రేపింది. భీమ్‌గల్ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త బొదిరె స్వామి, వైస్ చైర్మన్ భర్త జేజే నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, డీసీసీ జిల్లా కార్యదర్శి కుంట రమేశ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అరిగెల జనార్దన్, గిరిజన నాయకుడు గోపాల్ నాయక్ సహా మండలంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు గ్రామాల సర్పంచులు బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి వ్యవహార శైలిపై నిప్పులు చెరిగారు. ఆదివారం భీమ్‌గల్‌లో ఆయన దిష్టిబొమ్మను ఊరేగించి ప్రధాన కూడలిలో దహనం చేశారు. ముత్యాల సునీల్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ పదవులు అమ్ముకున్న సునీల్‌రెడ్డిని వెంటనే తొలగించాలని నినదించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఏండ్ల తరబడి పోరాడిన నాయకులు, గిరిజన నాయకులకు అన్యాయం చేస్తున్నాడని, డబ్బులకు అమ్ముడుపోయి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నాడని మండిపడ్డారు. మండల అధ్యక్ష పదవిని మున్సిపాలిటీకి చెందిన వ్యక్తికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అధిష్ఠానం చర్యలు తీసుకోకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కాగా భీమ్‌గల్.. పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ సొంత మండలం కావడంతో తిరుగుబాటు వ్యవహారం ఆయనకు తలనొప్పిగా మారింది.

# కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్య..



- విద్యాభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:** రాష్ట్రంలో విద్యాభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముందుకుసాగుతోందని, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచేలా కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస అన్నారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన విద్యా శాఖ వారోత్సవాల ముగింపు వేడుకలను ఆదివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆది శ్రీనివాస్‌తో పాటు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఆలపించిన 'జయ జయహే తెలంగాణ' గీతం, చేసిన నృత్యాలు సదస్యులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన, అలాగే వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. మొత్తం 11 మంది ఉత్తమ విద్యార్థులకు లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహకాన్ని అందజేశారు. అదేవిధంగా బడికి తక్కువ సెలవులు తీసుకుని క్రమశిక్షణతో హాజరైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. . రాష్ట్రంలో విద్యా రంగానికి సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రాబోయే బడ్జెట్‌లో విద్య కోసం 15 శాతం నిధులు కేటాయిస్తామని సీఎం ప్రకటించారని అన్నారు. . ఇప్పటికే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, కాస్మొటిక్, డైట్ ఛార్జీలను కూడా పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 10 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు కల్పిస్తోందని అన్నారు. విద్యాభివృద్ధి, యువతకు ప్రత్యేక శిక్షణ కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను మంజూరు చేసినట్లు తెలిపారు . సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (డే స్కాలర్ విధానం) వైపు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారని, అక్కడ ఉచిత రవాణా, నాణ్యమైన టిఫిన్, భోజనం, స్నాక్స్ అందిస్తుండటంతో అడ్మిషన్లకు భారీ పోటీ ఏర్పడిందని అన్నారు . ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రజా ప్రభుత్వం తరఫున హైదరాబాద్‌లో సన్మానించనున్నట్లు తెలిపారు. జూన్ 12 వరకు పది శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6న ప్రారంభించిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జూన్ 12 వరకు పది ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టామని, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరు రకాల ప్రత్యేక నిపుణులతో రోగ నిర్ధారణ సేవలు అందించామని అన్నారు . డ్రైవర్లకు కంటి, వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు సర్పంచులు, వార్డు సభ్యులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలందరూ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు కావాలని, అక్కడ అందించే కోడిగుడ్లు, బాలామృతం, ఇక్రిశాట్ స్నాక్స్, పాలు వంటి పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యాశాఖ వారోత్సవాల సందర్భంగా జిల్లాలో సైన్స్ ల్యాబ్‌లు, అదనపు తరగతులు, ఇంకుడు గుంతలను ప్రారంభించామని, విద్యార్థుల కోసం రెమెడీయల్ తరగతులు, సమ్మర్ క్యాంపులు నిర్వహించి వారిలోని ప్రతిభను వెలికితీశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుతమైన వసతులు, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులు వీటిని ఉపయోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఆయా విద్యాసంస్థల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి రోజువారీ దినపత్రికలు, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, ఇది భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. టైం టేబుల్ ప్రకారం చదువుతూ, పరీక్షలకు ముందే సిలబస్ పూర్తి చేసి, పాత ప్రశ్నపత్రాలను సాధన చేయాలని విద్యార్థులకు, వారిని నిరంతరం ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, వివిధ మండలాల ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులు

## ఫర్టిలైజర్ డీలర్‌పై పోలీసులకు ఫిర్యాదు



**శాయంపేట,మే 17 :** నకిలీ విత్తనాల కారణంగా తాము తీవ్రంగా నష్టపోయామంటూ వరంగల్ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి, సూరంపేట గ్రామాలకు చెందిన 22 మంది రైతులు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. గట్లకానిపర్తిలోని శ్రీవేంకటేశ్వర ఫర్టిలైజర్ డీలర్ కుసుమ మురళిపై ఫిర్యాదు చేశారు. డీలర్ తమకు నకిలీ విత్తనాలు అంటగట్టి నిండా ముంచాడని ఆరోపించారు. డీలర్ మురళి.. కావేరి 929 రకం ఆడ, మగ వరి విత్తనాలను ఇచ్చాడని, పంటసైతం తానే కొంటానని అగ్రిమెంట్ రాయించుకున్నాడని, తీరా నకిలీ విత్తనాలని తేలడంతో ఎకరాకు 10 కిలో ల పంట కూడా రావడం లేదని వాపోయారు. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులను, అధికారులను కోరారు.

# జనాభా లెక్కల సిబ్బందికి ప్రజలు సహకరించాలి




- మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :** జనాభా లెక్కలు--2026 కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పట్టణంలో కొనసాగుతున్న తొలి దఫా హౌస్ సెన్సస్ ప్రక్రియలో ఎన్యూమ రేటర్లు, సూపర్వైజర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ వివరాలను నమోదు చేస్తున్నారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి నివాసాన్ని సందర్శించి కుటుంబ వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జిందం కళా చక్ర పాణి మాట్లాడుతూ, దేశ ప్రణాళికా రూపకల్పన, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు మరియు ప్రజల అవసరాల అంచనాకు జనాభా లెక్కలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. తొలి దఫాలో గృహ గణన జరుగుతుందని ఇందులో 34 రకాల ప్రశ్నలు ఉంటాయని, రెండవ దఫా లో జనాభా గణన ఉంటుందని. జనాభా లెక్కల సిబ్బంది అడిగే వివరాలను ఎలాంటి సందేహాలు లేకుండా నిజాయితీగా తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సూపర్వైజర్ కూతురు కర్ణాకర్ రెడ్డి, ఎన్యూమరేటర్ పర్కాల రవీందర్ గార్లు పాల్గొన్నారు.

# యువతిని హత్య చేసిన నిందితుడి మృతి

## పారిపోతుండగా స్థానికుల దాడి

## చికిత్స పొందుతూ మణితేజ మృతి



**జడ్చర్లటౌన్, మే 17 :** ప్రేమించలేదని యువతిని కత్తితో గొంతు కోసి హత్య చేయగా.. స్థానికుల దాడిలో తీవ్రంగా గాయపడిన ప్రేమోన్మాది దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వివరాలు ఇలా.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని నిమ్మబావిగడ్డ ప్రాంతంలో నివాసముంటున్న వైష్ణవి(24)ని ఓ యువకుడు కత్తితో హత్యచేసి పారిపోతున్న క్రమంలో స్థానికులు పట్టుకొని చితకబాదారు. తీవ్రంగా గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. యువతిని హత్య చేసిన యువకుడు హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన మణితేజ(29)గా గుర్తించారు. లాండ్రీ షాపు నిర్వహిస్తున్న మణితేజ కొన్నాళ్లుగా జడ్చర్లకు చెందిన వైష్ణవిని ప్రేమపేరుతో వేధిస్తుండగా, సదరు యువతి తిరస్కరించినట్టు సమాచారం. వైష్ణవికి మరొకరితో పెండ్లి సంబంధం కుదిరిన విషయం తెలుసుకున్న మణితేజ మరింత కక్ష పెంచుకొని శనివారం సాయంత్రం జడ్చర్లలోని నిమ్మబావిగడ్డ ప్రాంతంలో ఒంటరిగా ఇంటికి వెళ్తున్న వైష్ణవిని అడ్డగించి హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

# యువజన, క్రీడా వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 డేస్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ నెల 18 వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా 18వ తేదీన సోమవారం జిల్లాస్థాయిలో ఉదయం ఏడు గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ ప్రోగ్రాం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఏ రాందాసు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. వివిధ పాఠశాలల, కళాశాలల బాల బాలికలు, యువత, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ కోచ్ లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, క్రీడా అసోసియేషన్ సభ్యులు, ప్రెసిడెంట్లు తరలివచ్చి విజయవంతం చేయాలని రాందాస్ కోరారు. అలాగే ఈ నెల 23వ తేదీన సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో నిర్వహింకానున్న జాబ్ మేళా పోస్టర్లు ఆవిష్కరించారు.

# అరుబయట నిద్రించే ప్రజలు అప్రమత్తంగా ఉండండి

## ఇల్లంతకుంట ఎస్ ఐ సిరిసిల్ల అశోక్



**బలగం, టీవీ ఇల్లంతకుంట** అరుబయట, డాబాలపై ఇంటి ముందు వాకిల్లాలో నిద్రించే ప్రజలు అప్రమత్తం గా ఉండాలని ఇల్లంతకుంట ఎస్ ఐ సిరిసిల్ల అశోక్ కోరారు. ఎండాకాలం దృష్ట్యా ప్రజలు ఆరు బయట డాబాలపైన నిద్రిస్తున్నందున బంగారు ఆభరణాలు విలువైన వస్తువులు సెల్ఫోన్లు బయట పెట్టుకొని నిద్రించడం జరుగుతుందని కావున ప్రజలు అప్రమత్తంగా ఉండండి దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఇటీవల మన చుట్టుపక్కల ప్రాంతంలో ఆరు బయట నిద్రించిన మహిళల మెడలో నుంచి బంగారు ఆభరణాలు దొంగలించిన కేసులు నమోదైనవి కావున ప్రజలు వీలైతే ఆరు బయట నిద్రించకూడదని, ఇంటి డోర్లు తెరచి పడుకోవడం జరుగుతుంది విలువైన ఆభరణాలు సెల్ ఫోన్లు వస్తువులు బయట పెట్టుకోకూడదని తెలిపారు. దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా అయన కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మీకు రక్షణగా ఉంటుందని అయన అన్నారు.

# టీపీఎస్‌లో అగ్నిప్రమాదం..

## కాలిపోయిన కేబుళ్లు, వాల్స్

## నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు



**దామరచర్ల, మే 17 :** నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంటులో అగ్ని ప్రమా దం జరిగింది. ఈ నెల 12న సీవోడీ పూర్తిచేసుకున్న మూడో యూనిట్‌లో ఆదివారం ఉదయం బాయిలర్ ఫీడింగ్ పంప్ వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా నిప్పు అంటుకొని భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. మంటలు, పొగ దట్టంగా అలుముకోవడంతో కార్మికులు, అధికారులు అప్రమత్తమయ్యారు. ప్లాంటులోని అగ్నిమాపక దళాలు స్పందించి మంటలు ఆర్పివేశారు. ఈ సమయంలో కార్మికులు, ఉద్యోగులు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అగ్ని ప్రమాదంలో కంట్రోల్ కేబుళ్లు, వాల్వ్‌లు కాలిపోగా మెయిన్ మెషినరీకి ఎలాంటి నష్టం జరుగలేదని సమాచారం. మొదటి యూనిట్ ప్రారంభమైన తొలి రోజుల్లోనే ఇదే రీతిలో ఆయిల్ లీకేజై కింద వెల్డింగ్ చేస్తుండగా మంటలు అంటుకొని ప్రమాదం జరిగింది.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

టు

# రేవంత్..ఫ్యూచర్ లేని లీడర్..

కావాలని, ఉద్యమనేత కేసీఆర్ స్ఫూర్తితో పార్టీని బలోపేతం చేసి, మళ్లీ బీఆర్ఎస్ పాలనను తెచ్చుకుందామని కేటీఆర్ పిలుపునిచ్చారు.అధికార పార్టీ నేతలతో లేనిపోని వివాదాలకు దిగకుండా, సోషల్ మీడియాలో ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ వారియర్స్ అత్యంత శక్తివంతంగా ఉన్నదని కొనియాడారు. రాబోయే ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని, డివిజన్లవారీగా సోషల్ మీడియా కమిటీలు వేయాలని ఆదేశించారు. బీఆర్ఎస్ వారియర్స్ పోరాటం వల్లే కలుగులో దాక్కున్న నిందితుడు లొంగిపోయాడని తెలిపారు. ఈ విషయంలో ధైర్యంగా నిలబడిన బీఆర్ఎస్ మహిళా నాయకత్వం, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చూపిన చొరవ, సోషల్ మీడియా వారియర్స్.. ఇలా అందరి పోరాటం వల్లే ఇవాళ బాలికకు న్యాయం జరిగే పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. సంఘటితంగా శక్తివంతమైన కార్యకర్తలు, ప్రజాశక్తితో ఆడబిడ్డకు న్యాయం జరిగేలా చేయడంలో బీఆర్ఎస్ శ్రేణుల కృషి అభినందనీయమని, అదే కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కమిటీలన్నీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గడపగడపకు తిరుగుతూ సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపట్టాలని కోరారు. ప్రతి ఒక్కరికీ మెంబర్‌షిప్ కార్డులను చేరవేయాలని, ఈ కార్డుతో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలను చెరవేసేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆగస్టు నాటికి నియోజకవర్గంలో అన్ని కమిటీలను నియమించుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ చెప్పారు. బీజేపీకి అనుకూలంగా లేనిచోట ఓట్లు తొలగించే ప్రమాదం ఉన్నదని, ఇప్పటివరకు ఎస్ఐఆర్ జరిగిన రాష్ట్రాల్లో లక్షలాది ఓట్లు గల్లంతైన విషయాన్ని ప్రస్తావించారు. వచ్చే నెలలో ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి బూత్‌లెవల్ కార్యకర్త బూత్ లెవల్ ఏజెంట్‌గా ప్రతి బూత్ పరిధిలో ఓటర్లను కాపాడుకోవాలని కోరారు. కాంగ్రెస్ సర్కార్ దొంగ ఓట్లను వేయించే పరిస్థితి ఉన్నదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డబుల్ ఓట్లను ఏరివేయడంతో పాటు ఏదో ఒక చోట ఓటు హక్కు ఉండేలా చూడాలని తెలిపారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాల్సిందే

బలోపేతానికి కృషి చేసిన వారికే కార్పొరేటర్ టికెట్లు దక్కుతాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రెండున్నర సంవత్సరాల్లో భూముల ధరలు, రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిన్నాయని, మళ్లీ కేసీఆర్ నాయకత్వం వస్తే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్, మహమ్మద్ అలీ, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తలసాని సాయికిరణ్, కమల సుధీర్‌రెడ్డి, గజ్జల సుష్మా మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జట్టా రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'కరీంనగర్ సింహగర్జన'కు 25 ఏండ్లు..

ఉద్యమ పార్టీ జెండా ఎత్తిననాడు దండిగా గుండెధైర్యం తప్ప ధన బలం లేదు..రాజకీయ బలగం లేదు..అయినా సభాస్థలికి జనం పోటెత్తారు..'అని గుర్తుచేశారు. తనను కన్నభూమి తెలంగాణ ఎందుకిలా గోస పడుతున్నదన్న ఆవేదన, మాతృభూమిపై గుండెలనిండా ఉప్పొంగే ప్రేమ, రాష్ట్రాన్ని సాధించి నాలుగుకోట్ల జనుల కలలు సాకారం చేయాలనే పట్టుదల, ప్రజలందరూ అండగా ఉంటారనే భరోసా..ఈ నాలుగు అంశాలు ఉద్యమనేత కేసీఆర్‌ను నడిపించిన నాలుగు రథచక్రాలని ప్రస్తుతించారు.

## బండి సంజయ్ రాజకీయ భవిష్యత్తుకు బీటలు..

నమోదైన పోక్సో కేసు ఆయన రాజకీయ భవిష్యత్తుకు సమాధి కడుతుందనే అభిప్రాయాలు రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. రాబోయే రోజులు రాజకీయంగా 'బండి'కి కష్టకాలమేననే చర్చ నడుస్తున్నది. పోక్సో కేసు దేశవ్యాప్తంగా చర్చకు దారితీయడం, పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే ప్రమాదం పొంచి ఉండటంతో బీజేపీ అధిష్ఠానం సైతం ఈ వ్యవహారంపై ఫోకస్ పెట్టిందని, కొద్దిరోజుల్లోనే కేంద్ర సహాయ మంత్రి భవితవ్యంపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందనే చర్చ జోరుగా సాగుతున్నది. ఇప్పటికే ఆయనకు పదవీగండం పొంచి ఉన్నదని, భవిష్య త్తులో అంతకుమించి జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని చర్చించుకుంటున్నారు. రాజకీయాల్లో దుందు డుకుతనం కంటే సహనం ఎక్కువ అవసరమని చెప్తుంటారు. కానీ, ముందూ వెనుక, మంచీ చెడు, చిన్నాపెద్ద అనే వివేచన, గౌరవం లేకుండా ఇన్నాళ్లూ తన నోటి దురుసుతో పలువురు రాజకీయ నేతలపై టార్గెట్‌గా మాట్లాడిన ఆయన నోరే ఇప్పుడు మూతపడే పరిస్థితి వచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. గతంలో కేంద్ర సహాయ మంత్రి చేసిన వ్యాఖ్యలను ట్రోల్ చేస్తూ కర్మ ఎవరినీ వదిలిపెట్టదని సోషల్ మీడియాలో నెటిజన్లు చురకలేస్తున్నారు.

## రష్యాపై భారీ డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి..

తెల్లవారుజామున రష్యాపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు ఉక్రెయిన్ పాల్పడింది. రష్యా రాజధాని మాస్కోలోని కొన్ని ప్రాంతాలు, సమీప ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించాయి. 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 1,000కు పైగా ఉక్రేనియన్ డ్రోన్‌లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.మరోవైపు రాజధాని వైపు దూసుకొచ్చిన సుమారు 81 డ్రోన్‌లను వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. ఈ దాడుల వల్ల పలు ప్రాంతాల్లోని నివాస భవనాలు, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. నలుగురు మరణించారని, వీరిలో ముగ్గురు మాస్కో ప్రాంతానికి చెందినవారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలోని బెల్గోరోడ్ ప్రాంతంలో మరో మరణం నమోదైనట్లు వెల్లడించారు.

## ధాన్యం కొనరు.. లారీల కొరత తీర్చరు

వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.రైతులు వరిధాన్యం కాంటా వేశాక అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైస్‌మిల్లుల్లో అన్‌లోడ్ అయ్యేవరకు రైతులను ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని ప్రశ్నించారు. అదనపు కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. రైతులుధాన్యం కాంటా వేయగానే ట్రక్‌షీట్ ఇవ్వాలని, రైస్‌మిల్లుల్లో అన్‌లోడ్ అయ్యేవరకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వడ్లన్నీ కొనుగోలు కేంద్రాల్లో ఉన్నాయని, వానొస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

## డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు..

నగదు స్వాధీనం చేసు కున్నారు. నిందితులు ఇచ్చిన సమా చారం ఆధారంగా హైదరాబాద్‌లోని మదీనాగూడకు చెందిన మరో వ్యక్తిని ఎన్‌సీబీ అరెస్టు చేసింది. సూత్రధారి ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసి, ఫ్రీలాన్స్ కెమిస్ట్‌గా పనిచేస్తు న్నట్టు గుర్తించారు. హైదరాబాద్‌లోని ప్రశాంత్‌నగర్‌లో సొంత ల్యాబొరేటరీలోనే అల్ప్రాజోలం రహస్యంగా తయారు చేస్తున్నట్టు అతను అంగీకరించాడు. ఈ ముఠా సుమారు 150 కిలోల అల్ప్రాజోలం విక్రయించినట్టు ప్రాథమిక విచారణలో తేలింది.

# ఉప్పల్ వరంగల్ రూటులో ట్రాఫిక్ ఆంక్షలు

- వరంగల్ బస్ స్టాప్ నల్లచెరువుకు తరలింపు



హైదరాబాద్,మే17 : ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగు తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉప్పల్ సర్కిల్‌లోని వరంగల్ బస్టాప్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను నల్లచెరువు కట్ట సమీపానికి మార్చారు. ఉప్పల్ వద్ద వరంగల్ వైపు వెళ్లే రహదారిని ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలను జీఎస్ఐ వద్ద దారి మళ్లించనున్నారు. జీఎస్ఐ జంక్షన్ వద్ద బీరప్పగడ్డ మీదుగా ఎన్‌హెచ్-163 మీదకు డైవర్ట్ చేయనున్నారు. అలాగే, వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను మేఫీల్ హోటల్ వద్ద దారి మళ్లించనున్నారు. ఉప్పల్ భగాయత్ మీదుగా నాగోల్ సర్వీస్ రోడ్డులో వెళ్లి ఫ్లైఓల్గ÷వర్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేశారు. వరంగల్ నుంచి వచ్చే పెద్ద వాహనాలు ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్‌కు మళ్లిస్తారు. వరంగల్‌కు వెళ్లే భారీ వాహనాలను హయత్‌నగర్, ఓఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్‌కు మళ్లించనున్నారు.


# సీబీఎస్ఈ ఫలితాలపై వివాదం..

- నీట్ లీకేజీ వేళ మరో కలకలం
- 12వ తరగతి ఫలితాలపై విద్యార్థుల అనుమానాలు
- ఓఎంఎస్ విధానంపై సందేహాలు
- బాగా రాసినా తక్కువ మార్కులొచ్చాయని ఆందోళన
- విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం .. నెటిజన్ల ఫైర్
- రీవాల్యుయేషన్ ఫీజు 100కు తగ్గించిన సీబీఎస్ఈ




న్యూఢిల్లీ, మే 17 : నీట్ ప్రశ్నపత్రం లీకేజీ లక్షలాది విద్యార్థులపై ప్రభావం చూపింది. ఆ వివాదం పూర్తిగా సమసిపోకముందే ఇప్పుడు మరో కొత్త వివాదం మొదలైంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) గత నెల విడుదల చేసిన 12వ తరగతి ఫలితాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఈ ఏడాది అమలు చేసిన 'ఆన్ స్క్రీన్ మార్కింగ్'(ఓఎస్ఎమ్) విధానం సమర్థతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ ఏడాది సీబీఎస్ఈలో 85.2 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఇది గత ఏడాది కంటే 3.19 శాతం తక్కువ. సీబీఎస్ఈ ఈ ఏడాది పాత పద్ధతిలో కాకుండా ఓఎస్ఎమ్ విధానంలో డిజిటల్ మూల్యాంకనం చేపట్టింది. ఇందులో భాగంగా సమాధాన పత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు.టీచర్లు వాటిని కంప్యూటర్ స్క్రీన్‌పై చెక్ చేసి మార్కులు డిజిటల్‌గా నమోదు చేశారు. మొత్తం మార్కులు కంప్యూటరే లెక్కపెట్టి చూపిస్తుంది. ఇలా మొత్తం 98,66,622 సమాధాన పత్రాలు మూల్యాంకనం చేశారు. ఫలితాల విడుదల అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేకమంది విద్యార్థులకు ఆశించిన దాని కంటే తక్కువ మార్కులు రావడం, కొన్ని సమాధానాలు మిస్ కావడం, ముఖ్యంగా ఫిజిక్స్, మ్యాథ్స్ వంటి సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడం వంటి సమస్యలకు కొత్త మూల్యాంకన విధానమే కారణమని మండిపడుతున్నారు. జేఈఈ వంటి పోటీ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి కూడా బోర్డు పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం, ఫెయిల్ కావడంతో షాక్‌కు గురయ్యారు. డిజిటల్ స్కానింగ్ ప్రక్రియలో మార్జిన్లలో రాసిన సమాధానాలు లేదా కొన్ని పేజీలు సరిగా స్కాన్ కాలేదని, దీని వల్ల నేరుగా మార్కులపై ప్రభావం పడిందని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. 17 సంవత్సరాలుగా సీబీఎస్ఈ సమాధాన పత్రాలను మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయుడు సంజీవ్ మాట్లాడుతూ.. తక్కువ మార్కులు వచ్చాయని ఇంత భారీస్థాయిలో ఫిర్యాదులు రావడం ఇదే మొదటిసారని చెప్పారు. "ఆన్ స్క్రీన్ మార్కింగ్ విధానం గురించి ఉపాధ్యాయులు, ఎగ్జామినర్లకు మూల్యాంకనం ప్రారంభానికి కేవలం నెల ముందు మాత్రమే సమాచారం ఇచ్చారు. కాపీల చెకింగ్ ప్రారంభానికి కొద్దిసమయం ముందు మాకు ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. ఇంత పెద్ద వ్యవస్థను తొందరపాటుగా అమలు చేయకూడదు" అని సంజీవ్ అన్నారు. స్కానింగ్ సమయంలో ఏర్పడిన సాంకేతిక సమస్యలు కూడా మూల్యాంకనాన్ని ప్రభావితం చేసి ఉండవచ్చని ఆయన తెలిపారు. మూల్యాంకనంలో పొరపాట్లు జరిగాయని విద్యా శాఖ అధికారులు అంగీకరించారు. సుమారు 13 వేల ఆన్సర్ షీట్లలో పొరపాట్లు గుర్తించామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కులపై సందేహాలుంటే ఈ నెల 19-22 మధ్య స్కాన్డ్ కాపీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఫలితాలపై ఆందోళనలు రేకెత్తుతుండడంతో సీబీఎస్ఈ సమాధాన పత్రాల రీవాల్యుయేషన్ చార్జీలను రూ.700 నుంచి రూ. 100కు తగ్గించింది. అంతేకాకుండా పరీక్షలు, ఫలితాలు, మూల్యాంకనంపై విద్యార్థుల ప్రశ్నలు, సందేహాలను తీర్చేందుకు టెలి కౌన్సెలింగ్ సపోర్ట్ హెల్ప్‌లైన్ 1800118004 ఏర్పాటు చేసింది.

# ఢిల్లీకి ఎండ గండం..




- ఇప్పటికే ఉడుకుతున్న ఢిల్లీ..
- ఎండలు ఇంకా పెరుగుతాయన్న ఐఎండీ

న్యూఢిల్లీ, మే 17 : దేశరాజధాని ఢిల్లీ ఇప్పటికే అత్యధిక ఉష్ణోగ్రతలతో అట్టుడికిపోతోంది. ఎండలు మండిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అలాంటిది రాబోయే రోజుల్లో ఎండలు ఇంకా పెరుగుతాయని ఐఎండీ (భారత వాతావరణ శాఖ) హెచ్చరించింది. సోమవారం నుంచి ఈ వారమంతా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరనున్నట్లు వెల్లడించింది. అలాగే, భారీగా వడగాడ్పులు వీస్తాయని కూడా హెచ్చరించింది. దీని ప్రకారం.. ఎండలో బయటకు వెళ్లడం అసౌకర్యంగా కాదు.. ప్రమాదకరమే అని నిపుణులు అంటున్నారు.ఇప్పటికే ఢిల్లీలో 40 డిగ్రీలకు పైగా ఎండకాస్తోంది. శనివారం 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వేడినే ఢిల్లీ ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. అలాంటిది మరో ఐదు డిగ్రీల ఎండలు పెరగడమంటే సాధారణ విషయం కాదు. ఢిల్లీ వైపు తూర్పు నుంచి వీచే గాలుల దిశ మారడం వల్లే ఈ పరిస్తితి ఉందని నిపుణులు అంటున్నారు. ఈ గాలులు కాస్త చల్లదనాన్ని, తేమను అందిస్తాయి. కానీ, ఇప్పుడు రాజస్థాన్, పాకిస్తాన్ నుంచి వాయువ్య దిశలో వేడి గాలులు వీస్తుండటం వల్ల ఎండ, వేడి పెరుగుతోందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ గాలుల్లో ఎలాంటి తేమ ఉండదు.ఈ కారణంగా ఎండలు దాదాపు నాలుగైదు డిగ్రీలు పెరగవచ్చు. మే 23 వరకు ఇదే తరహా ఎండలు కాసే అవకాశం ఉంది.ఢిల్లీలోనే కాకుండా పంజాబ్, హరియాణా, చండీగఢ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, విదర్భ, చత్తీస్‌గఢ్‌లకు కూడా భారీ ఎండలు తప్పవని ఐఎండీ తెలిపింది. విదర్భలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 46 డిగ్రీల ఎండ నమోదవుతోంది. ఢిల్లీలో రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణ స్థాయికి మించి పెరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో ఢిల్లీలో వీలైనంత వరకు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించాలని సీఎం రేఖా గుప్తా.. ప్రైవేటు కంపెనీలకు సూచించారు.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

- తప్పిన పెను ముప్పు .. సకాలంలో స్పందించిన ఉద్యోగులు



హైదరాబాద్, మే 17: నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో నిర్మాణ దశలో ఉన్న యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని యూనిట్-3లో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఇంజినీర్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. యూనిట్-3 పరిధిలోని టర్బైన్ డ్రైవెన్ బాయిలర్ ఫీడ్ పంప్ ఏరియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పంప్ వద్ద లూబ్రికేషన్ ఆయిల్ లీక్ కావడమే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా అధికారులు అంచనా వేశారు. చమురు లీకేజీ కారణంగా మంటలు వేగంగా వ్యాపించి, ప్లాంట్ ప్రాంగణమంతా దట్టమైన నల్లటి పొగ కమ్ముకుంది. ఈ ప్రమాదంలో పంప్ ఏరియాలోని కంట్రోల్ కేబుళ్లు, కొన్ని కీలకమైన వాల్వ్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి.అయితే ప్లాంట్ సిబ్బంది, అక్కడే ఉన్న అగ్నిమాపక యంత్రాల ఉద్యోగులు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. ఫలితంగా ప్లాంట్‌లోని బాయిలర్లు, మెయిన్ టర్బైన్లు వంటి ప్రధాన యంత్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న తెలంగాణ జెన్‌కో ఉన్నతాధికారులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నష్టాన్ని అంచనా వేయడంతో పాటు, ప్రమాదానికి కచ్చితమైన కారణాలు తెలుసుకోవడానికి అంతర్గత విచారణకు ఆదేశించారు. ఈ యూనిట్‌లో ఈనెల 13న అధికారికంగా కమర్షియల్ ఆపరేషన్ డేట్ (సీఓడీ)ని ఖరారు చేయడం గమనార్హం. అది జరిగిన నాలుగు రోజుల్లోనే అగ్ని ప్రమాదం జరగడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# డైట్ బిల్లులు విడుదల: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, మే17 : గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు సంబంధించిన డైట్, కాస్మొటిక్ చార్జీలు, భవనాల అద్దె బిల్లులు రూ.221.24 కోట్లు విడుదల చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. విద్యార్థులకు సంబంధించి బిల్లులను ప్రతినెలా చెల్లిస్తామని తెలిపారు.

# బండి సంజయ్ రాజీనామా చేయాలి

- బీఆర్ఎస్ యూఎస్ఏ విభాగం ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి డిమాండ్



హైదరాబాద్, మే 17: తనయుడిపై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో వెంటనే బండి సంజ య్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ యూఎస్ఏ ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన పదవిలో కొనసాగితే విచారణ ప్రభావితయ్యే అవకాశమున్నదని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజానికి దారి చూపాల్సిన వ్యక్తి కొడుకు దారి తప్పడం దురదృష్టకరమని అన్నారు. పోలీసులు నిష్పాక్షికంగా విచారణ జరిపి బాలికకు న్యాయం చేయాలని కోరారు.తెలంగాణ సమాచారం.

# జవహర్ నగర్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- నేపాలీ దంపతులతో పాటు మరొకిరి అరెస్ట్
- నిందితుల నుంచి నగదు, బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డిసిపి సుమతి

హైదరాబాద్,మే17 : సికింద్రాబాద్‌లోని జవహర్‌నగర్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. వృద్ధ దంపతులను కట్టేసి ఇంట్లో చోరీ చేసిన నేపాలీ ముఠాలో కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 12న జరిగిన చోరీలో నేపాలీ దంపతులు మమత, రమేశ్‌తోపాటు సబీనాను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. 8 మంది నేపాలీ ముఠా సభ్యులు చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు వివరాలను మల్కాజ్‌గిరి సీపీ సుమతి మీడియాకు వెల్లడించారు. ఈ చోరీ కేసును 250కి పైగా సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించడంతో లభించిన క్లూస్ ఆధారంగా 72 గంటల్లో ఈ కేసును ఛేదించినట్లు మల్కాజ్‌గిరి సీపీ సుమతి వెల్లడించారు. పక్కా ఎ÷-లాన్‌తో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి తెగబడిన ఈ ముఠాలో నలుగురిని అరెస్టు చేశామని, మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మీనా అలియాస్ మమత పుట్టిన రోజు వేడుకల కోసం మిగతా వారు వచ్చారని యజమానులను నమ్మించి.. వృద్ధ దంపతులను కట్టేసి ఈ ముఠా చోరీకి పాల్పడిందని వివరించారు. ఇకపై ఇంటి యజమానులు ఎవరైనా పనిలో పెట్టుకొనేవారి వివరాలను తాము రూపొందించిన యాప్‌లో నిక్షిప్తం చేయాలని సుమతి సూచించారు.

# సంపాదకీయం

## ఆర్థిక కార్యాచరణ అత్యవసరం !

నాలుగు రాష్ట్రాలఅసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్దంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్థ రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు. హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్ముజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడంలేదు.అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యావసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంట నూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అనినింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణ మవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబిం చాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకుపోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యల ను తక్షణం అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి నిర్ణయాలు అవసరం.ఆర్థిక నిపుణులతోచర్చించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు తలపండిన ఆర్థికవేత్త నేతృత్వం లో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా గ్రామాల నుంచి పట్టణాల వరకు నిరంతరం గా అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించాలి. మన దేశ వనరులు, వినియోగం, దిగుమతులను విశ్లేషించాలి. ఎక్కడ ఖర్చులు తగ్గించవచ్చో అన్నది ప్రజలతో పాటు, మేధావుల నుంచి సూచనలు స్వీకరించాలి. అప్పుడే మనకు ఒక పరిష్కారం దొరుకుతుంది. అంతే తప్ప కాన్వాయ్‌లలో ఒకటి రెండుకార్లను తగ్గించడం వల్ల దేశఆర్థిక వ్యవస్థ చక్కబడదని ప్రధాని మోడీ త్వరగా గుర్తిస్తే మంచిది.

# నీట్ పేపర్ లీకుకు మరొకరు బలి




### ఆందోళన కలిగిస్తున్న విద్యార్థుల ఆత్మహత్యలు

**జయపుర,మే16 :** నీట్-యూజీ 2026 పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ లీక్‌వల్ల పరీక్ష రద్దవడంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా రాజస్థాన్‌లోనూ ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఈ పరీక్షలో 650 మార్కులు వస్తాయని తన కుమారుడు చెప్పాడంటూ అతడి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఝున్‌ఝున్ జిల్లాకు చెందిన ప్రదీప్ మహిచ్.. తన ఇద్దరు సోదరులతో కలిసి సికార్‌లో నివసిస్తున్నాడు. అక్కడే నీట్ పరీక్ష కోసం ఒక ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకున్నాడు. మే 3న జరిగిన నీట్- యూజీ పరీక్ష రాశాడు. అయితే, శుక్రవారం మధ్యాహ్నం అతడు తన గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన అతడి సోదరి వెంటనే స్థానికుల సహాయంతో సమీప ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నీట్ పరీక్షను బాగా రాసినట్లు తన కుమారుడు చెప్పాడని, 650 మార్కులు వస్తాయన్నాడని ప్రదీప్ తండ్రి పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రభుత్వ సీటు ఖాయమని గట్టి నమ్మకంతో ఉన్నాడంటూ ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పరీక్ష రద్దవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఈ ఘటనపై రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. నీట్ పరీక్ష రద్దు నేపథ్యంలో దిల్లీ, యూపీల్లోనూ విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని ఆయన అన్నారు.

# భోజ్‌శాల వద్ద భద్రత కట్టుదిట్టం

### హైకోర్టు తీర్పుతో జిల్లా యంత్రాంగం చర్యలు

**భోపాల్,మే17 :** భోజరాజు కాలంలో ఏర్పాటు చేసిన భోజశాల కాలక్రమంలో ఇస్లాం దాడుల్లో కనుమరుగయ్యింది. దానిని ముస్లింలు స్వాధానం చేసుకున్నారు. ఆనాటి నుంచి ఆ వివాదం కొనసాగుతూనే ఉంది. ఇది సరస్వతీమాత ఆలయంగా హిందువుల విశ్వాసం. తాజాగా మధ్యప్రదేశ్‌లోని వివాదాస్పద భోజ్‌శాల కాంప్లెక్స్ హిందూ ఆలయానికి చెందుతుందని ఆ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం నాడు సంచలన తీర్పు వెలువరించింది. మసీదు నిర్మాణం కోసం ముస్లింలు ప్రత్యామ్నాయ స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు జస్టిస్ విజయ్ కుమార్ శుక్లా, జస్టిస్ అలోక్ అవస్థితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడ సరస్వతిదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆలయాన్ని సందర్శించే ప్రజలకు తగిన వసతులు కల్పించాలని సూచించింది. భోజ్‌శాల కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకోవాలని కేంద్ర పురావస్తు శాఖను ధర్మాసనం ఆదేశించింది. ఈ చారిత్రక కట్టడం పరిరక్షణ, భద్రత, మతపరమైన ఆచారాల నియంత్రణకు సంబంధించి పురావస్తు శాఖకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. 1958 నాటి



ఎఎస్ఐ చట్టం ప్రకారం, ఈ ఆస్తుల బాధ్యతలను ఎఎస్ఐ నిర్వర్తిస్తుందని ధర్మాసనం తెలిపింది. భోజ్‌శాల ఆలయ వ్యవహారాలు, పరిపాలనపై కేంద్ర ప్రభుత్వం, పురావస్తు శాఖ సంయుక్తంగా తుది నిర్ణయం తీసుకుంటాయని తెలిపింది. భవిష్యత్తులో ఈ కట్టడం చారిత్రక నేపథ్యం దెబ్బతినకుండా ఎఎస్ఐ పర్యవేక్షణలో నిర్వహణ కొనసాగుతుందని ధర్మాసనం తెలిపింది. పురావస్తు శాఖ ఇటీవల సమర్పించిన రెండు వేల పేజీల సర్వే నివేదికను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. మసీదు నిర్మాణం కంటే ముందే అక్కడ పర్మార్ రాజుల కాలం నాటి ఆలయం ఉండేదని, పాత ఆలయ భాగాలతోనే మసీదు నిర్మించారని పురావస్తు శాఖ నివేదికలో పేర్కొంది. ఈ ఆధారాలనే ధర్మాసనం ప్రామాణికంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించి సవాలు చేస్తామని ముస్లిం గ్రూపు ప్రకటించింది. మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేస్తుందన్న విశ్వాసం తమకు ఉందని ఎఐఎఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసి సోషల్ మీడియాలో పేర్కొన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వం ధార్ జిల్లాలో భద్రతను కట్టుదిట్టం చేసింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ధార్‌లోని భోజ్‌శాల ఆలయం- కమల్ మౌలా మసీదు కాంప్లెక్స్ పరిసరాల్లో దాదాపు 1,200 మంది పోలీసులను మోహరించారు. వివాదాస్పద ప్రదేశాల్లో అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన కంటెంట్‌ను వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ధార్ కలెక్టర్ రాజీవ్ రంజన్ మీనా హెచ్చరించారు.

# తైవాన్‌పై మాట మార్చిన ట్రంప్

- చైనా పర్యటన తరవాత వైఖరిలో మార్పు

**వాషింగ్టన్,మే17 :** తైవాన్ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది తమకు కష్టమైన సమస్యేనని వెల్లడించారు. భౌగోళికంగా ఆ ప్రాంతం తమకు చాలా దూరంలో ఉందని వ్యాఖ్యానించారు. తైవాన్ అంశం క్లిష్టమైన సమస్యే. ఈ ద్వీపం.. చైనాకు కేవలం 95 కిలోమీటర్ల దూరంలో ఉండగా, అమెరికాకు మాత్రం 15 వేల కి.మీ.కు పైగా దూరంలో ఉంది. సుదూర ప్రాంతం కారణంగా మేం వేగంగా స్పందించడం కష్టమే. చైనా చాలా శక్తిమంతమైన, పెద్ద దేశం కూడా. ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్‌లు సంయమనం పాటించాలి అని ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ట్రంప్ చెప్పారు. వారి స్వాతంత్ర్య ఆకాంక్షల కోసం అంతదూరం ప్రయాణించి మేం యుద్ధం చేయాలని అనుకోవడం లేదన్నారు. చైనా పర్యటన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించు కుంది. తైవాన్ సమస్యను సరిగ్గా పరిష్కరించకపోతే.. అమెరికా-చైనా మధ్య ఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని ట్రంప్‌నకు జిన్‌పింగ్ స్పష్టం చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తైవాన్ జలసంధిలో అం తటా శాంతి, స్థిరత్వాన్ని పరిరక్షించడమే ఇరుదేశాల మధ్య ఉన్న అతిపెద్ద విషయమ న్నారు. అమెరికా- చైనాలు భాగస్వామ్య దేశాలుగా ఉండాలే తప్పా... ప్రత్యర్థులుగా కాదని అన్నారు. తైవాన్‌ను తనలో పూర్తిగా విలీనం చేసుకోవాలని చైనా కోరుకుంటోంది. తైవాన్ స్వాతంత్ర్యాన్ని అమెరికా బహి రంగంగా వ్యతిరేకించాలన్నది చైనా వాదన. 'తైవాన్ విషయంలో చైనా ఏకపక్ష చర్యలకు దిగరాదు' అని ఇంతకాలం అమెరికా స్పష్టం చేస్తూ వచ్చింది. దానికి భిన్నంగా ఇప్పుడు ట్రంప్ మాట్లాడుతున్నారు. తైవాన్‌కు ఆయు ధాలు విక్రయించాలా, వద్దా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పడమూ ఆయన వైఖరిలో మార్పును వెల్లడిస్తోంది.




# విమానయాన సంస్థలకు భారీ ఊరట



- ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ పై వ్యాట్ తగ్గింపు

**న్యూఢిల్లీ,మే16 :** విమానయాన సంస్థలకు భారీ ఊరట కలిగిస్తూ ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ పై వ్యాట్ ను భారీగా తగ్గించింది. ఏటీఎఫ్‌పై ప్రస్తుతం ఉన్న వ్యాట్‌ను 25 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. విమానాలు నడిపేందుకు జెట్ ఇంజన్లలో ఏటీఎఫ్ వినియోగిస్తున్నారు. వ్యాట్ తగ్గింపునకు ఢిల్లీ సర్కార్ తాజా నిర్ణయంతో ఇం ది రా గాం ధీ. అంతర్జాతీయ విమానాయాశ్రంలో ఇంధనం కొనుగోలు చేసే విమానయాన సంస్థలు తక్కువ ధరలను చెల్లించే వీలుంటుంది. 'ఏటీఎఫ్‌పై వ్యాట్‌ను 25 శాతం నంచి 7 శాతానికి తగ్గించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ఎయిర్‌లైన్స్‌కు, సాధారణ ప్రయాణికులకు లబ్ది చేకూరుతుంది' అని ఒక అధికార ప్రకటన విడుదల చేశారు. దీనికి ఒకరోజు ముందు మహారాష్ట్ర ప్రభుత్వం సైతం ఏటీఎఫ్‌పై వ్యాట్‌ను 18 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. మే 15వ తేదీ నుంచి ఆరు నెలల పాటు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, గ్లోబల్ క్రూడాయిల్ ధరల పెరుగుదల, సరఫరాలో అవాంతరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. భారతీయ విమానాయాన సంస్థల మొత్తం నిర్వహణ ఖర్చుల్లో సుమారు 35 నుంచి 45 శాతం జెట్ ఇంధనానికే ఖర్చవుతుంది. ఏటీఎఫ్‌పై వ్యాట్ తగ్గింపు నిర్ణయంతో ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి ప్రముఖ విమానయాన సంస్థలకు ఒకింత ఊరట కలుగనుంది.

# ఢిల్లీ ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం పట్టివేత

- రూ.5.5 కోట్ల విలువైన పసిడి స్వాధీనం

**న్యూఢిల్లీ,మే17 :** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి అక్రమ బంగారం గుట్టురట్టయింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ బంగారం స్మగ్లింగ్ యత్నాలను భగ్నం చేశారు కస్టమ్స్ అధికారులు. పక్కా సమాచారంతో నిఘాపెట్టిన కస్టమ్స్ విభాగం అధికారులు.. అమెరికా నుంచి వచ్చిన ఓ భారత సంతతి వ్యక్తి వద్ద నుంచి రూ.5.5 కోట్ల విలువైన పసిడిని స్వాధీనం చేసుకున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి వచ్చిన సదరు ప్రయాణికుడు ఎవరికీ అనుమానం రాకుండా విమానాశ్రయం నుంచి బయటపడేందుకు యత్నించాడు. అయితే.. అంతర్జాతీయ స్మగ్ల ర్లు భారీగా బంగారాన్ని భారత్‌కు తరలిస్తున్నా రనే ముందస్తు సమాచారంతో అధికారులు అప్పటికే అలర్ట్ అయ్యారు. సదరు ప్రయాణి కుడి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో కస్టమ్స్ బృందం అతడిని అడ్డుకుని విచారించింది. అతడిని, లగేజీని తనిఖీ చేయగా.. అసలు విషయం వెలుగుచూసింది. అతను ధరించిన ప్రత్యేక బెల్టుతో పాటు ప్యాంటు జేబుల్లో అత్యంత చాకచక్యంగా దాచిన 115 బంగారు బిస్కెట్లను(24 క్యారెట్లు) అధికారులు గుర్తించారు. ఇవి మొత్తం సుమారు 3.5 కిలోల బరువు ఉంటాయని, వీటి మార్కెట్ విలువ దాదాపు రూ.5.5 కోట్ల వరకు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితుడిని అరెస్ట్ చేసిన అధికారులు.. ప్రస్తుతం అతని కాల్ డేటా, ప్రయాణ వివరాలు, ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తి రవాణాదారు మాత్రమేనని.. దీని వెనుక అంతర్జాతీయ స్మగ్లింగ్ సిండికేట్ హస్తమున్నట్టు అనుమానిస్తున్నారు. ఇటీవల బంగారంపై దిగుమతి సుంకం పెరగడంతో స్మగ్లింగ్ కేసులు ఎక్కువయ్యాయని.. అందుకే ఎయిర్‌పోర్టుల్లో అత్యాధునిక స్క్రీనింగ్ టెక్నాలజీ, రిస్క్ ప్రొఫైలింగ్ ద్వారా నిఘాను మరింత తీవ్రం చేసినట్లు వెల్లడించారు కస్టమ్స్ అధికారులు.



# నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్,మే16 :** ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల మీదుగా కేరళ తీరాన్ని తాకుతాయని, అక్కడి నుంచి నాలుగైదు రోజుల్లో తెలంగాణలో ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే తెలంగాణలో మాత్రం ఎండల తీవ్ర తగ్గడం లేదు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ అధికారి ధర్మరాజు తెలిపారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 41-44 డిగ్రీలు, మిగతా జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.



# విదేశీ పర్యటనలపై పన్ను అంటూ కథనాలు

- ఓ టీవీ ఛానల్ కథనంపై మోడీ స్పందన
- అలాంటిదేమీ లేదంటూ ఎక్స్‌లో పోస్ట్



**న్యూఢిల్లీ,మే17 :** విదేశీ పర్యటనలపై కూడా కేంద్ర ప్రభుత్వం పన్ను లేదా సర్‌చార్జ్ విధించేందుకు యోచిస్తోందంటూ వచ్చిన వార్తలపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆ కథనంలో నిజమనేదే లేదని తేల్చి చెప్పారు. పశ్చిమాసియా ఘర్షణలతో ముడిచమురు ధరలు పెరగడం, రూపాయి మారకం విలువ అంతకంతకూ పతనం అవుతున్న నేపథ్యంలో ఆర్థిక రంగంపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం విదేశీ పర్యటనలపై తాత్కాలికంగా పన్ను విధించేందుకు యోచిస్తోందని సీఎన్‌బీసీఒక కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనంపై ప్రధాని ఘాటుగా స్పందించారు. 'ఇది పూర్తిగా అసత్యం. ఈ కథనంలో వాస్తవమనేదే లేదు. విదేశీ పర్యటనలపై ఆంక్షలు విధించే ప్రశ్నే లేదు. వ్యాపార నిర్వహణ, ప్రజల జీవనాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు మేము కట్టుబడి ఉన్నాము' అని ప్రధాని ఎక్స్ వేదికగా స్పష్టతనిచ్చారు. ప్రధాని పోస్టు తరువాత ఆ వార్తా ఛానల్ కూడా తన కథనాన్ని ఉపసంహరించుకుంది. తమ కథనంలో కచ్చితత్వం లోపించిందని అంగీకరించింది. ఈ తప్పిదానికి విచారం వ్యక్తం చేస్తున్నామంటూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. దేశంలో ఇంధన రంగంలో గడ్డు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రధాని శుక్రవారం యూఏఈలో పర్యటించారు. భారత్‌లో వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలకు సంబంధించి యూఏఈతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశీయ ఇంధన రంగ భద్రత, ధరల హెచ్చుతగ్గుల నుంచి రక్షణ దిశగా ఈ ఒప్పందం కుదిరింది.

# పెట్రో ధరల పెంపుతో సామాన్యులపై భారం

- సిపిఎం నిరసన ప్రదర్శన

**హైదరాబాద్,మే16:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై నేరుగా ప్రభావం పడుతుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలి. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రా యిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపేలా కృషిచేయా లని డిమాండ్ చేశారు. మోదీ చెబుతున్న పొదుపు మంత్రంతో దేశాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గ్యాస్ ధరల పెంపుతో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.దేశం నేడు తీవ్రమైన దుర్భర పరిస్థితిలో ఉందని చెప్పారు. నేరం చేసేవాడు ఒకడైతే ప్రజలకు శిక్ష వేసే పరిస్థితి నేడు నెలకొందని ఆరోపించారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆగితే ఈ ధరలు పెంచాల్సిన అవసరం ఉండదన్నారు. అయితే, ప్రధాన మంత్రి మోడీ యుద్ధ నివారణ చర్యలు తీసుకోకుండా, అమెరికాకు దాసోహం అయిపోయి ట్రంప్‌నకు సాష్టాంగ నమస్కారం చేస్తూ ప్రజలు ధరలను భరించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

# రైతు సమస్యలపై అదే నిర్లక్ష్యం

## ధాన్యం సేకరణలో పూర్తి వైఫల్యం: వేముల



నిజామాబాద్,మే : ధాన్యం కొనుగోళ్లు, తరలిం పులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫల మయ్యిందని మాజీ మంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. సిఎం రేవంత్ సమీక్షించినా పరిస్థితిలో మార్పు లేద న్నారు. మక్కులు, వరి ధన్యం కొనుగోలు చేసి, సకాల ంలో తరలించకపోవడంతో రైతులు నానా అగచాట్లు పడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ప్రతి వర్గానికి ఆకర్షణీయమైన హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చా క రైతులు, వృద్ధులు, మహిళలు, నిరుద్యోగులను ఇలా అందరినీ మోసం చేసిందని మండిపడ్డారు. జొన్న కొనుగోలు కేంద్రా లను తక్షణమే ప్రారంభించి, రైతులకు మద్దతు కల్పిం చాలని డిమాండ్ చేసారు. రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా మంతరులకు కనిపించడం లేదా అని అన్నారు. రైతులను పట్టించుకోని కాంగ్రెస్ పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతు భరోసా పేరుతో ఏడాదికి రూ. 15 వేల సాయం, కౌలు రైతులకు ఆర్థిక భరోసా, వరికి బోనస్, ప్రతి పంటకు మద్దతు ధర, రైతుబీమా కొనసాగింపు, వృద్ధులకు పింఛన్ల పెంపు, మహిళలకు భరోసా, నిరు ద్యోగులకు ఉపాధి అవకా శాలు అంటూ అనేక హామీలు ఇచ్చిందని గు ర్తుచేశా రు. కానీ నేడు రైతులు పండించిన పంటను అమ్ముకో వడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేద న్నారు. వృద్ధులకు భరోసా అందడం లేదని, యువతకు ఉద్యోగ అవకాశాలు కనిపించడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు.

# బంగారం ధరల్లో పతనం

## పదిగ్రాములపై రూ.980ల మేర తగ్గిన ధర

## రూపాయి మారకం కనిష్టానికి చేరిక



న్యూఢిల్లీ,మే : భారత్‌లో శనివారం కూడా బంగారం, వెండి ధరల్లో పతనం కనిపించింది. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు యూఎస్ డెట్ సెక్యూరిటీలపై రాబడులు పెరగడం, డాలర్ బలపడుతున్న నేపథ్యంలో దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర శుక్రవారంతో పోలిస్తే రూ.980ల మేర తగ్గి రూ.1,56,930కు పడిపోయింది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.900ల మేర తగ్గి రూ.1,43,850కు చేరుకుంది. నగరంలో కిలో వెండి ధర రూ.15 వేల మేర తగ్గి రూ.2.9 లక్షలకు దిగింది. దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సగటున రూ.950 మేర తగ్గింది. వెండి ధరలో రూ.10 వేల మేర కోత పడింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910కు చేరుకుంది. 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,47,500 వద్ద ట్రేడవుతోంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,57,080గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,44,000గా ఉంది. ముంబైలో 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,930కు చేరుకోగా 22 క్యారెట్ల వెండి ధర 1,43,850కు చేరింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో కిలో వెండి ధర రూ.3 లక్షల మార్కు దిగువకు చేరుకుంది. చెన్నైలో గరిష్ఠంగా కిలో వెండి రూ.2.9 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇదిలావుంటే భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ శుక్రవారం ఒక దశలో 50 పైసలు క్షీణించి రూ.96.14కు చేరుకుంది. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.96 మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరగడం, డాలర్ బలోపేతం, దేశీయంగా ధరలు మరింత ఎగబాకవచ్చన్న ఆందోళనలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. అయితే, ఆర్‌బీఐ జోక్యంతో రూపాయి మళ్లీ కాస్త కోలుకుంది. దాంతో డాలర్‌తో మారకం రేటు 17 పైసల నష్టంతో రూ.95.81 వద్ద ముగిసింది. ఇది కనిష్ఠ ముగింపు స్థాయి కూడా. గురువారం సెషన్‌లో డాలర్‌తో రూపీ మారకం రేటు 2 పైసలు లాభపడి రూ.95.64 వద్ద క్లోజైంది. అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ 0.34 శాతం పెరిగి 99.15 స్థాయిలో ట్రేడైంది. బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర ఒక దశ లో 3.14 శాతం పెరిగి 109.04 డాలర్లకు చేరుకుంది. 6 రోజుల్లో 2 శాతం డౌన్: గడిచిన 6 ట్రేడింగ్ సెషన్లలో డాలర్‌తో రూపాయి మారకం విలువ దాదాపు 2 శాతం క్షీణించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 6 శాతానికి పైగా పతనమైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, దాంతో చమురు ధరలు 100 డాలర్ల పైకి ఎగబాకడం, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ, ద్రవ్యోల్బణ భయాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవాహం తగ్గడం వంటి అంశాలు మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా రూపాయిపై ఒత్తిడి కొనసాగనుందని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు. ముున్ముందు సెషన్లలో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.95.60-96.20 శ్రేణిలో కదలాడవచ్చన్నారు.

# తన అభిప్రాయాలను వక్రీకకరించిన ఓ వర్గం మీడియా

- బొద్దింక వ్యాఖ్యలపై సుప్రీం సిజెఐ వివరణ



న్యూఢిల్లీ,మే : ఎలాంటి ఉద్యోగాలు లభించని, ఏ వృత్తిని చేపట్టని కొందరు యువత బొద్దింకల్లా తయారవుతున్నారని, వ్యవస్థపై దాడి చేస్తున్నారంటూ తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ వివరణ ఇచ్చారు. తన నోటి మాటలను ఒక వర్గం మీడియా వక్రీకరించిందని, దేశంలోని యు వతను విమర్శించినట్టుగా తప్పుగా చిత్రీకరించిందని అన్నారు. తాను దేశ యువతను విమర్శించాననడం పూర్తిగా నిరాధారమని అన్నారు.'ఏ మాత్రం హేతుబద్ధత లేని ఒక కేసు శుక్రవారంనాడు విచారణకు వచ్చినప్పుడు నేను వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఒక వర్గం మీడియా తప్పుగా ప్రచారం చేసింది. కొందరు బోగస్ డిగ్రీలతో లీగల్ వృత్తిలోకి వస్తున్న వారిని ఉద్దేశించి మాత్రమే నేను విమర్శించాను. అలాంటి వ్యక్తులు మీడియాలోకి, సామాజిక మాధ్యమాల్లోకి, ఇతర నోబెల్ ప్రొఫెషనల్‌లో చొరబడుతున్నారు. అలాంటి వారిని పరాన్నజీవులుగా అభివర్ణించారు. అంతే కానీ దేశం లోని యువతను విమర్శించినట్టు మీడియాలో కథ నాలు రావడం పూర్తిగా నిరాధారం. ఆ వార్తలు నాకు బాధ కలిగించాయి' అని సీజేఐ సూర్యకాంత్ వివరణ ఇచ్చారు. దేశంలోని యువతను చూసి తాను గర్విస్తుంటానని, అభివృద్ధి చెందిన భారతదేశా నికి యువత మూలస్తంభాలని సీజేఐ ప్రశంసిం చారు. ఖనియర్ అడ్వకేట్ హోదా కోరుతూ ఒక న్యాయవాది వేసిన పిటిషన్ సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం ముందుకు శు క్రవారంనాడు విచారణకు వచ్చిన సందర్భంగా పిటిషనర్‌పై సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కొంతమంది పరాన్నజీవులు సమాజంలో ఉన్నారని, వారితో మీరు చేతులు కలుపుతారా అని ప్రస్నించారు. ఫేస్‌బుక్‌లో పిటిషన్ వాడిన భాషను కూడా సీజేఐ ప్రస్తావించారు. ప్రపంచంలో అందరికీ సీనియర్ అడ్వకేట్ హోదా లభించినా, మీకు మాత్రం ఆ అర్హత దక్కదన్నారు. ఢిల్లీ హైకోర్టు మీకు ఆ హోదా ఇచ్చానా, వృత్తిపరమైన ప్రవర్తనచూసి తాము దానిని రద్దు చేస్తామన్నారు. చాలామంది న్యాయవాదుల డిగ్రీల ప్రామాణికతపై తమకు అనుమానాలవు కూడా ఉన్నాయని చెప్పారు. ఈ విషయంలో సీబీఐ విచారణ కోరాలని భావిస్తున్నట్టు చెప్పారు. దీంతో పిటిషనర్ క్షమాపణ చెప్పుకున్నారు. కేసు ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని కోరారు. అందుకు న్యాయస్థానం అనుమతించింది.

# పెట్రో, డీజిల్ ధరల పెంపుపై సిపిఐ ఆందోళన

## ఆటో ట్రాలీని తాడుతో లాగి నిరసన



నిజామాబాద్,మే16 : పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దారుణమని, వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీ సుధాకర్, కోటగిరి మండల కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం ట్రాలీ ఆటోకు తాడు కట్టి లాగుతూ ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, మండల కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు, సామాన్యులు, చిరు ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సామాన్యుల నడ్డి విరిచేలా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మండిపడ్డారు. ధరల నియంత్రణలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇంకా పొదుపు మంత్రం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియడంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ 12 ఏళ్ల పాలనలో అన్నింటి విఫలమయ్యారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో రూ.300 ఉన్న గ్యాస్ ధర బీజేపీ హాయంలో రూ.1000కి పైగా చేరుకోవడంతో పాటు ప్రజలకు 45 రోజుల గ్యాస్ దొరికే పరిస్థితి లేదని మండిపడ్డారు. చిరు వ్యాపారులకు కమర్షియల్ గ్యాస్ దొరకక హోటల్లు మూతపడడే పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీలు పెంచి ప్రజలపై ప్రత్యక్ష భారాలు మోపడం సరికాదని ధ్వజమెత్తారు. బీజేపీ హయాంలోనే పెట్రోల్ డీజిల్ గ్యాస్ పై జీఎస్టీ తెచ్చిందని పెట్రోల్, డీజిల్ పై జీఎస్టీ ఎత్తివేస్తే ధరలు తగ్గుతాయని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజల పక్షాన ఆందోళన, నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నల్ల గంగాధర్, నీలి శంకర్, రాజు, రాములు, హను మండ్లు, అన్సార్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ



ఆదిలాబాద్,మే16 : పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరి చేరకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ముఖ్యంగా డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీరాణి సూచించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా తాండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఒక్క దోమ అనేక ప్రమాదాలు అనే నినాదంతో ప్రజలలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఏడీస్ ఈజిప్ట్ దోమ వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందన్నారు. ఇంటి లోపల ఉండే పూల కుండీలు, కూలర్లు, మంచినీటి తొట్లు, కొబ్బరి బోండాలు, నిల్వ ఉన్న మంచి నీటి పరిసరాలలో స్థావరం ఏర్పాటు చేసుకుని జబ్బు బారిన పడిన వ్యక్తి నుంచి వాహకాన్ని మోసుకొచ్చి కుట్టడం వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందన్నారు. పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, ఫ్రై డ్రైడే పాటించాలని, సమాజ భాగస్వామ్యం తోనే డెంగ్యూను నివారించవచ్చని అన్నారు. ఎవరికైనా జ్వరం బారిన పడినట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు నిర్వహించుకుని, నిర్ధారణ అయితే మందులు వాడాలని సూచించారు.

# బండి భగీరథ్‌పై లుకౌట్ నోటీసులు

## బండి సంజయ్ నివాసాల్లో సోదాలు

## ఐదు బృందాలు ముమ్మర గాలింపు



హైదరాబాద్,మే : బండి భగీరథ్ పై పేట్ బషీరాబాద్ పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని బండి సంజయ్ నివాసంలో తనిఖీలు చేపట్టిన సైబరాబాద్ పోలీసులు.. ఢిల్లీ, కరీంనగర్, హైదరాబాద్‌లో పోలీస్ బృందాలుగా గాలింపు కొనసాగిస్తున్నారు. అతని కోసం 5 బృందాలు గాలిస్తున్నాయని తెలిపిన పోలీసులు వెల్లడించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. పోక్సో కేసులో భగీరథ్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. దీంతో భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బాలిక స్టేట్‌మెంట్ ఇప్పటికే పోలీసులు రికార్డు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు మేజిస్ట్రేట్ ఎదుట బాధితురాలి స్టేట్‌మెంట్‌ను మరోసారి రికార్డు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం భగీరథ్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మే 8న పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాలిక ఫిర్యాదు మేరకు నమోదైన ఈ కేసులో లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ కేసులో విచారణ నిమిత్తం రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరయ్యారు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని, పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. భగీరథ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# ఉగ్రవాదులను ఉసికొల్పితే అంతే సంగతులు

- భూమ్మీద ప్రపంచ పటంలో పాక్ ఉండదు
- పాక్‌ను నేరుగా హెచ్చరించిన ఆర్మీ చీఫ్ ద్వివేదీ



న్యూఢిల్లీ, మే : ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ భారత్‌పై దాడులు కొనసాగిస్తే ప్రపంచపటంలో పాకిస్థాన్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. భౌగోళికంగా ఉండాలా లేక చరిత్రలో కలిసిపోవాలా అనేది పాకిస్థాన్ తేల్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. భారత్‌పై దాడులు చేసే ఉగ్రవాద సంస్థలకు మద్ద తు ఇవ్వడం ఆపాలని ఆయన పాక్‌ను హెచ్చరిం చారు. దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకీ వెళ్లదని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకునేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణి స్తుందని, అందరిపై కఠిన చర్యలు తీసుకుంటు ందని పునరుద్ఘాటించారు. అలాగే గతేడాది పహల్గాం దాడికి ప్రతిస్పందనగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా ద్వివేది మాట్లాడారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాల ఉనికిని 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ప్రపంచానికి తెలియజేశాం. ఉగ్ర స్థావరాలకు సంబంధించిన ఆధారాలు అందజేశాం. పాకిస్థాన్ ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలి. ఆపరేషన్ సిందూర్ రెండో వెర్షన్ మరింత తీవ్ర స్థాయిలో ఉంటుంది. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ పౌరుల రక్షణ, శ్రేయస్సు విషయంలో రాజీ పడదు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తుంది' అని ద్వివేది తేల్చి చెప్పారు. ఒకవేళ పాకిస్థాన్ ఉగ్రవాదులను పోషించి, వాళ్లను ఇండియా మీదకు ఉసి గొల్పితే, అప్పుడు ఆ దేశం ఈ భూమ్మీద ఉండాలా లేదా అన్న అంశాన్ని వాళ్లే నిర్ణయించు కోవాల్సి ఉంటుందన్నారు. చరిత్రలో ఆ దేశానికి స్థానం ఉండాలంటే ఉగ్రవాదులను పెంచి పోషించరా దన్నారు. మానేక్‌షా సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకవేళ ఆపరేషన్ సింధూర్ చేపట్టడానికి దారి తీసిన పరిస్థితులు మళ్లీ వస్తే ఏం చేస్తారని ఆయన్ను ప్రశ్నించారు. జనరల్ ద్వివేది తన వ్యాఖ్యల్లో పాకిస్తాన్‌కు నేరుగా వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇండియా నిలుస్తుందన్నారు. గత ఏడాది మే 7వ తేదీన పాక్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారు. ఆ తర్వాత పాక్ దాడులు చేసినా.. ఇండియా వాటిని తిప్పికొట్టింది. సుమారు 88 గంటల పాటు రెండు దేశాలు యుద్ధం కొనసాగించాయి. మే 10వ తేదీ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగింది.

# ఏజెన్సీ దళితులకు అందని పథకాలు

## దళితుల సమస్యలపై స్పందించని సిఎం

## బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భరత్ చౌహాన్



ఆదిలాబాద్,మే1 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏజెన్సీ దళితులను మోసం చేశారని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భరత్ చౌహాన్ ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మం డలం మహాదాపూర్ గ్రామాన్ని ఆయన సందర్శించి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నివాసముం టున్న ఎస్సీలకు కనీస సదుపాయాలు, ప్రభుత్వ ఫలాలు అందక దయనీయ స్థితిలో జీవనం కొనసా గిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాత ముత్తా తల కాలం నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టా లు లేక రైతు భరోసా పథకానికి దూరమవుతు న్నార న్నారు. కనీసం సాగు చేసే భూములకు పహనీలు నిలిపివేయడంతో బ్యాంకు రుణాలు పొం దలేని దుస్థితి నెలకొందని వాపోయారు. రోడ్డు సౌకర్యం, తాగునీటి వసతి వంటివి లేక అవస్థలు పడుతున్న పట్టించుకునే నాథులేరన్నారు. అయిన ప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ఏజెన్సీ ప్రాం తంలోని దళితుల గురించి పట్టిం చుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, బాలాజీ, రాజ్ కుమార్, అర్జున్, శుద్ధోధన్, నీల్ కంఠ్, రాందాస్, కైలాస్, చంద్రకాంత్ తదితరులున్నారు.

# భూ వివాదంలో ఘర్షణ

- కర్రలు, కత్తులతో దాడులతో పలువురికి గాయాలు

వరంగల్,మే : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూర్యతండా పరిధిలోని మర్రి తండాలో ఇరువర్గాల మధ్య ఘర్షణ కలకలం రేపింది. గ్రామానికి చెందిన రమావత్ గ్యాస్య, రమావత్ రేఖ్య మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న భూవివాదం నేపథ్యంలో శుక్రవారం రాత్రి కర్రలు, కత్తులతో దాడులు చేసుకున్నారు. దీంతో అక్కడ పరి స్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనలో రమావత్ గ్యాస్య, రమా వత్ రేఖ్యతో పాటు కిరణ్, రాజేందర్, నవీన్, జీవన్ సహా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వరంగల్‌లోని ఎం జీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘర్షణ గురించి సమా చారం అందుకున్న రాయపర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# ఫామ్‌హౌజ్‌లో ఇద్దరు వృద్ధ మహిళల హత్య

## రంగంలోకి దిగిన పోలీసులు..

రంగారెడ్డి,మే : మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు మహిళలను గుర్తుతెలియని వ్యక్తులు అతి దారుణంగా హత్య చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్యకు గురైన వారి మృతదేహాలను పరిశీలించారు. మృతులను తాండూరులో అదృశ్య మైన ఇద్దరు వృద్ధులుగా పోలీసులు గుర్తించారు. వీరి వయసు దాదా పు 60 సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. బాధితులను వికా రా బాద్ నుంచి తీసుకొచ్చి ఫామ్‌హౌస్‌లో హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నాన్స్ డబ్బుల విషయంలోనే వీరి హత్య జరిగి నట్లు భావిస్తున్నారు. డబ్బు ఇస్తామని పిలిచి అత్యంత దారుణంగా హత్య చేసినట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసు లుదర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# నీట్ పేపర్ లీక్ కేసు

## పుణెకు చెందిన బాటనీ టీచర్ మనీషా అరెస్ట్

పుణె,మే : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మరో కీలక సూత్రధారి, పుణెకు చెందిన బోటనీ టీచర్ మనీషా మందారేను సీబీఐ అరెస్ట్ చేసింది. ఆమె నీట్ బయాలజీ ప్రశ్నాపత్రం లీక్ కావడంలో కీలక పాత్ర పోషించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పుణెకు చెందిన మనీషా బోటనీ విభాగంలో సీనియర్ అధ్యాపకురాలు మనీషాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ పక్రియలో స్జబెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా నియమించింది. ఏప్రిల్ నుంచి ఆమె కొందరు నీట్ అభ్యర్థులకు తన ఇంటి వద్దే శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆ సమయంలోనే ఆమె వారికి నీట్ పరీక్షకు సంబంధించిన బోటనీ, జువాలజీ పేపర్లలోని ప్రశ్నలను లీక్ చేశారు. ఆ ప్రశ్నలను నోట్ బుక్‌లో రాసుకోవాలని, టెక్ట్స్ బుక్‌లో మార్క్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆమె లీక్ చేసిన ప్రశ్నలు మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షలోని ప్రశ్నలతో సరిపోలినట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు . ఇప్పటికే ఈ కేసులో పుణెకు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ పీవీ కులకర్ణిని కూడా సీబీఐ అరెస్ట్ చేసింది. కులకర్ణి గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. కాగా, నీట్ ప్రశ్నాప్రతం లీకేజీ వ్యవహారంలో ఇప్పటివరకు ఢిల్లీ, జైపూర్, నాసిక్, పుణె, గురుగ్రామ్, అహిల్యానగర్ నుంచి తొమ్మిది మందిని సీబీఐ అరెస్ట్ చేసింది.

# తల్లిదండ్రులను విస్మరిస్తే కఠిన చర్యలు

జగిత్యాల,మే : వృద్ధ తల్లి దండ్రుల పోషణ విస్మరించి, వేధిం పులకు గురిచేస్తే వారి కుమారులు, కోడళ్లు, కూతుర్లు, వారసులకు జైలు శిక్ష తప్పదని, తల్లిదండ్రుల నుంచి కొడుకులు, కూతుర్లు పొందిన ఆస్తులను తిరిగి వారి తల్లి దండ్రుల పేరిట పట్టా మార్పిడీ జరుగుతుందని జగిత్యాల డివిజన్ వయోవృద్ధుల సంరక్షణ ట్రిబ్యునల్ అధికారి ఆర్డీవో పీ మధు సూదన్ హెచ్చరించారు. వయో వృద్ధుల సంరక్షణ చట్టం కింద వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆర్డీవో మధుసూదన్ రాయికల్ మండలం మూటపల్లి గ్రామానికి చెందిన ఏనుగు లింగారావు, సారంగపూర్ మండలం కొనాపూర్ గ్రామానికి చెందిన గడుప బక్కవ్వ, జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామా నికి చెందిన మతులాపురం రాజం అనే వృద్ధుల కేసుల్లో కొడుకులు, కూతుర్లు, కోడళ్ళను, అల్లుళ్లను, వారసులను శనివారం విచారిం చారు. సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ వృద్ధ తల్లిదండ్రుల పక్షాన వాదనలు వినిపిస్తూ న్యాయం చేయాలని కోరారు. విచారణకు హాజరు కాని వారికి సైతం చట్ట పరమైన చర్యలకు ఆర్డీవో నోటీసులు జారీచేశారు. ఈ కార్యక్ర మంలో కాన్సిలియేషన్ అధికారులు పీసీ హన్మంత్ రెడ్డి, వెల్మల ప్రకాష్ రావు, వృద్ధుల చట్టం సీనియర్ సహాయకురాలు పద్మజ పాల్గొన్నారు.

# పెద్ది ట్రైలర్..జస్ట్ వావ్ అంటూ చిరు లీక్స్




## ముందే ట్రైలర్ చూసి .. బృందాన్ని ప్రశంసించిన చిరంజీవి

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'పై అభిమానుల్లో భారీగా అంచనాలు ఉన్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం మే 18న విడుదల కాబోతున్న ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి ముందే వీక్షించారు. ట్రైలర్ చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, చిత్ర యూనిట్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ట్రైలర్ గురించి చిరంజీవి ట్వీట్ చేస్తూ.. ఇప్పుడే పెద్ది ట్రైలర్ చూశాను, జస్ట్ వావ్ అంతే! 3 నిమిషాల పాటు సాగిన ఈ ట్రైలర్ ప్యూర్ పవర్ ప్యాక్డ్‌గా ఉంది. చరణ్, బుచ్చిబాబు, రెహమాన్.. ఇలా ఒక్కొక్కరు తమ బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చారు. అందరూ కలిసి బాక్సాఫీస్‌ను రఫ్ఫాడించేశారు. ఈ సినిమా గురించి మనం ఎంత ఊహించుకున్నా, ఈ ట్రైలర్ దాన్ని మించి ఉంటుంది. ఇందులో ఎమోషన్, ఎలివేషన్, మ్యాడ్నెస్ అన్నీ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయి అని చిరు కొనియాడారు. ఎప్పటికప్పుడు తన సినిమాలకు లేదా చరణ్ సినిమాలకు సంబంధించిన ఆసక్తికర విషయాలను లీక్ చేస్తూ అభిమానులను అలరించే చిరంజీవి, ఈసారి కూడా తన అలవాటును రిపీట్ చేశారు. 'చాలా రోజులయ్యింది మీకు 'చిరు లీక్స్' ఇచ్చి' అంటూ సరదాగా వ్యాఖ్యానిస్తూ, పెద్ది ట్రైలర్‌లోని ఒక పవర్‌ఫుల్ డైలాగ్‌ను ఆయన లీక్ చేశారు. 'మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు? నేను పోరాడాను సారు.. అంటూ ట్రైలర్‌లోని ఈ డైలాగ్ ఎంతో అద్భుతంగా ఉందంటూ మెగాస్టార్ ప్రశంసించారు. ఈ క్రమంలోనే దర్శకుడు బుచ్చిబాబుకు క్షమాపణలు చెబుతూ.. 'సారీ బుచ్చిబాబు.. ట్రైలర్ చూశాక కంట్రోల్ తప్పి లీక్ చేయాల్సి వచ్చింది' అంటూ చిరంజీవి చమత్కరించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ట్రైలర్ మే 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగాస్టార్ స్వయంగా ఇచ్చిన ఈ రివ్యూతో మెగా అభిమానుల్లో, సినీ ప్రేక్షకుల్లో 'పెద్ది' ట్రైలర్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి.

# పెద్ది షూటింగ్‌లో ఉండలేకపోయిన చిరంజీవి



## ఆసక్తికర విషయాలు పంచుకున్న బుచ్చిబాబు సానా

'పెద్ది' సినిమా కోసం రామ్‌చరణ్ ఎంతో కష్టపడ్డారని దర్శకుడు బుచ్చిబాబు చెప్పారు. ఆయన దర్శకత్వంలో చరణ్ హీరోగా తెరకెక్కిన సినిమా 'పెద్ది'. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. రామ్ చరణ్‌కు కథ చెప్పగానే ఓకే అన్నారు. ఆ తర్వాత ఒకసారి ఇంటికి వెళ్లినప్పుడు చిరంజీవి తనకు కూడా కథ చెప్పమని అడిగారు. ఆయనకు కథ చెప్పడం గొప్ప అనుభవం. చాలా ఆసక్తిగా వింటారు. పాత్రల్లో లీనమైపోతారు. 'పెద్ది' సెట్స్‌కు కూడా వచ్చారు. చరణ్ పడుతున్న కష్టాన్ని చూసి గంటన్నర కంటే ఎక్కువసేపు ఉండలేకపోయారు. ఆయన వచ్చినప్పుడు కుస్తీ పోటీ సీన్ షూటింగ్ జరుగుతోంది. ఎండలో అలా రామ్‌చరణ్ కష్టపడడం చూడలేక అక్కడినుంచి వెళ్లిపోయారు. 'తండ్రి ఎంత కష్టమైనా పడతాడు కానీ, కొడుకు కష్టాన్ని మాత్రం చూడలేడు కదా..' అనిపించింది. మనం ఎంత కష్టపడితే దానికి తగిన ఫలితం వస్తుంది అని చిరంజీవి చెప్పారు. మీ శ్రమకు తగిన ఫలితాన్ని ఆడియన్స్ ఇస్తారని ప్రోత్సహించారు' అని తెలిపారు. పెద్ది'లో పాటలు కూడా హైలైట్‌గా నిలుస్తాయి. ఏఆర్ రెహమాన్‌తో వర్క్ చేయడం గొప్ప అనుభూతి. ఆయన ఎవరికీ తన నంబర్ ఇవ్వరట. నేను కలిసి కథ చెప్పిన మొదటిసారే నంబర్ ఇచ్చారు. అప్పటి నుంచి ఎప్పుడు కావాలంటే అప్పుడు అందుబాటులోనే ఉన్నారు. ఇందులో స్పెషల్ సాంగ్ అదిరిపోతుంది. ఆ ఆడియో బ్లాస్ట్ అయిపోతుంది. గొప్ప వ్యక్తి. 1000 సార్లు ఆయన ట్యూన్స్‌ను రిజెక్ట్ చేసినా మరొకటి చేద్దాం అనే మనస్తత్వం. చికిరి పాటకు నన్ను పక్కన కూర్చోబెట్టి ట్యూన్ అందించారు. పాజిటివ్‌గా ఉంటారు అని బుచ్చిబాబు చెప్పారు. జాన్వీకపూర్ కూడా చాలా నిబద్ధతతో వర్క్ చేశారని ఒక్క రోజు కూడా ఇబ్బంది పెట్టలేదని తెలిపారు.

# అగ్రతారల మూవీకి త్రిష దూరం

## కమల్, రజనీ సినిమాను తిరస్కరించినట్లు వార్తలు



వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్ హసన్ – రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్లు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమాల ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ.12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. కమల్ హాసన్ – రజనీకాంత్ 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. వీరి స్థాయికి తగినట్లే అగ్రకథానాయికను ఎంపిక చేయాలని టీమ్ త్రిషను తీసుకోనుందని గతంలో వార్తలు వచ్చాయి. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇక తాజాగా 'వీరభద్రుడు'లో లాయర్ ప్రీతిగా మెప్పించారు త్రిష. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా రూపొందుతోంది.

# క్రమశిక్షణ కలిగిన నటుడు విజయ్ : మాళవిక



కోలీవుడ్ అగ్ర కథానాయకుడు, తమిళనాడు సీఎం విజయ్‌పై నటి మాళవిక మోహనన్ ప్రశంసలు కురిపించారు. విజయ్‌తో కలిసి మాస్టర్ సినిమాలో నటించిన ఆమె ఆయనతో తనకున్న స్నేహం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ షూటింగ్‌లోనే విజయ్‌ను తొలిసారి కలిసినట్లు చెప్పారు.మాస్టర్' సినిమా మొదటిరోజు షూటింగ్‌లోనే చాలా కష్టమైన సీన్ చేయాల్సి వచ్చింది. నా డైలాగ్స్ మీదే దృష్టిపెట్టాను. ఆయన మాత్రం ఎలాంటి కష్టమైన సీన్‌లో నటించాల్సి వచ్చినా చాలా ప్రశాంతంగా ఉంటారు. ప్రతి విషయాన్ని గమనిస్తూ పూర్తిగా పని పైనే ఫోకస్ చేస్తారు. చాలా సరదాగా ఉంటారు. ఎప్పుడు అవసరం వచ్చినా ఫోన్ చేయగలిగే స్వేచ్ఛ ఇచ్చారు. అంత పెద్ద స్టార్ అయినప్పటికీ అలా అందుబాటులో ఉండడం చాలా గొప్ప విషయం అని చెప్పారు. విజయ్ క్రమశిక్షణ తనపై ప్రభావం చూపిందని ఆమె అన్నారు. 'మోహన్‌లాల్, రజనీకాంత్, విజయ్ లాంటి సీనియర్ నటుల సినిమాల్లో పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఉదయం 7 గంటలకు కాల్‌షీట్ ఉంటే 6:55కే సెట్స్‌లో ఉంటారు. అలాంటి వారి వల్ల నిర్మాతలకు డబ్బు వృథా కాదు అని తెలిపారు. 'మాస్టర్' సినిమాలో విజయ్‌తో కలిసి డ్యాన్స్ చేసే అవకాశం రాలేదని సరదాగా ఇప్పటికీ ఆయనతో చెబుతుంటానని మాళవిక నవ్వుతూ చెప్పారు.

# విడాకులు వచ్చే వరకు నటించను



## తనపై ట్రోల్స్ రావడంపై కన్నీటి పర్యంత అయిన జయం రవి

తాను ఎన్నో రోజులుగా సహనంతో ఉంటున్నానని.. వ్యక్తిగత విషయాల ఎక్కడా మాట్లాడలేదని నటుడు జయం రవి అన్నారు. ఇప్పుడు మాట్లాడాల్సిన సమయం వచ్చిందన్నారు. తాజా పరిణామాలపై ఆయన మీడియా ముందు మాట్లాడుతూ...తన పిల్లలకు కూడా తనని దూరం చేశారని కన్నీరు పెట్టుకున్నారు.ఇంతకాలం నా వ్యక్తిగత జీవితాన్ని మీతో పంచుకోనందుకు క్షమించండి. విడాకులు వచ్చే వరకూ నా సినిమాలు ఏవీ విడుదల కావు. అప్పటి వరకూ నేను కూడా నటించలేను. నాకు జరిగిన అవమానాలు ఇక భరించడం నా వల్ల కాదు. నన్ను ఇబ్బంది పెట్టాలని చూసేవారు ఆపేవరకూ నేను నటించలేను. ఆఫీసు లోనే ఉంటాను. రండి.. ఎంతగా ఇబ్బందిపెడతారో పెట్టండి. ఇకపై నేను మౌనంగా ఉండాలని అనుకోవడం లేదు అంటూ ఎమోషన్ అయ్యారు. నాకు విడాకులు వస్తాయా.. రావా అనేది పక్కన పెడితే నాపై జరుగుతోన్న ట్రోలింగ్ నన్ను బాధిస్తోంది. నా కెరీర్‌లో 95 శాతం చిత్రాలు హిట్. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చా. మహిళల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశా. అలాంటి నాపై ఎన్ని నిందలు వేస్తున్నారు. నా పిల్లలకు మంచి భవిష్యత్తు ఉండాలని నేను లక్షలు పెట్టివాళ్లను చదివించాను. వాళ్లపై నాకున్న ప్రేమ గురించి ఎవరికీ ఏమీ తెలియదు. నాకు ప్రేమలేదని రాసేస్తున్నారు. అవి ఎంత బాధిస్తోయో మీకేం తెలుసు అని బాధపడ్డారు. కేవలం ట్రోలింగ్ కారణంగానే తన స్నేహితురాలు కెనీషాను కోల్పోయానని అన్నారు. ఆమె ఎన్నో వేధింపులు ఎదుర్కొందన్నారు. ఇక తన వ్యక్తిగత జీవితంలో అడ్డంకులు అన్నీ తొలగిపోయిన తర్వాత కచ్చితంగా నటిస్తానని రవిమోహన్ చెప్పారు.

# రవితో రిలేషన్స్ వదులుకుంటున్నా






## ట్రోల్స భరించలేక..చెన్నై వదిలి వెళుతున్నా

## గాయని కెనీషా సుదీర్ఘ పోస్ట్

తమిళ నటుడు జయం రవి (రవి మోహన్)తో రిలేషన్‌లో ఉన్నట్లు వస్తోన్న వార్తలపై కెనీషా స్పందించారు. రవితో తన రిలేషన్‌కు ముగింపు పలికినట్లు పరోక్షంగా చెప్పారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఈ వార్తలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని చెప్పిన ఆమె.. చెన్నై వదిలి వెళ్లిపోతున్నట్లు తెలిపారు. తనకెంతో ఇష్టమైన సంగీతాన్ని కూడా వదులుకుంటున్నట్లు చెప్పారు. ఇన్‌స్టా ఖాతాను డిలీట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే నేను ఎన్నోసార్లు చెప్పాల్సిన దానికంటే ఎక్కువే చెప్పాను. ఈ కథలోకి నేను ఎంతో ప్రేమతో అడుగుపెట్టాను. కానీ ఇప్పుడు నిశ్శబ్దంతో వెనుదిరుగుతున్నాను. కొన్నిసార్లు ప్రపంచం మొత్తం అహంకారాలు, అవాస్తవ కథనాలతో నిండిపోతుంది. అక్కడ మంచితనానికి చోటు కూడా ఉండదు. అలాంటి పరిస్థితుల్లో ప్రేమ కూడా భారంగా మారుతుంది. ఒక మనిషిని రక్షించే ప్రయ త్నంలో నేను చాలా కోల్పోయాను. కానీ నాకు ఇప్పుడు ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. ప్రదర్శనలకే ప్రాధాన్యమిచ్చే ఈ లోకంలో మంచితనానికి విలువ లేదని అన్నారు. అతడు ఇక పూర్తిగా మీవాడే'. దీనిపై ఇక ఎలాంటి వివరణలు ఇవ్వను. ఇకపై నేను యుద్ధాలు చేయలేను. పోరాడనూ లేను. మంచి వ్యక్తులకు జీవించడానికి ఒక అవకాశం ఇవ్వాలని అనుకోవడం, వారికి అండగా నిలబడాలని ముందుకురావడం నా అమాయకత్వం. కానీ ఈ ప్రపంచం కేవలం అబద్ధాల కోరులు, మాయగాళ్లతో నిండిపోయింది. నేను అతడిని పూర్తిగా వదులుకుం టున్నాను. అలాగే, ఇప్పటివరకూ తీసుకున్న బాధ్యతలన్నింటి నుంచి వైదొలుగుతున్నా. ఈలోకంలో త్యాగాలు చేసిన జీవితంలోని నిజాల కంటే.. భావోద్వేగాలతో అల్లిన కథలనే జనం నమ్ముతారు. మొత్తానికి మీరు కోరుకున్నదే జరిగిందని అంటూ నేను ఓడిపోయాను. చెన్నై వదిలి వెళ్లిపోతున్నాను. నా సంగీతాన్ని, నా థెరపీని, నా జీవితానికి సంబంధించిన ప్రతిదాన్ని వదిలేస్తున్నాను. తన భార్య ఆర్తి నుంచి విడిపోతున్నట్లు రవిమోహన్ 2024లో ప్రకటించారు. ఆ క్రమంలోనే.. గాయని కెనీషాతో రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ రూమర్స్ వచ్చాయి.